

రేపు బిఎస్ఎన్ఎల్ అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల హక్కులు, సేవలపై అవగాహనా సదస్సును ఈనెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ మర్రి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకు నగరంలోని సూర్యమహల్ కూడలిలో గల సంచార్ భవన్‌లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియాలో నమోదైన కన్స్యూమర్ అడ్వొకేసీ గ్రూప్ సభ్యులు పరిశీలకులుగా పాల్గొంటారని, వినియోగదారులు ఈ సదస్సులో తమ సమస్యలు, సూచనలు తెలియజేయవచ్చని తెలిపారు. https://meet.google.com/mhn-nyky-rdx లింక్‌లో జాయిన్ కావాలని సూచించారు.

కడలి కల్లోలం

80 మీటర్ల మేర ముందుకొచ్చిన సముద్రం



మంచినీళ్లపేట తీరంలో ముందుకొచ్చిన సముద్రం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కడలి కల్లోలంగా మారింది. జిల్లాలోని 11 తీర ప్రాంత మండలాల్లో ఏ తీరం చూసినా ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం సుమారు 80 అడుగుల మేర ముందుకు వచ్చింది. అలల తాకిడికి జిల్లాలో భావనపాడు, బారువ, మంచినీళ్లపేట, దేవునల్తాడ, చినకొత్తూరు, అక్కుపల్లి, డోకులపాడు, సున్నాపల్లి ప్రాంతంలో తీరం కోతకు గురవుతోంది. ఇసుక దిబ్బలను రాకాసి అలల మింగేస్తున్నాయి. తీరంలో లంగరు వేసిన పడవలు, తెప్పలు అలలు ఉధృతికి పాడవుతున్నాయి. వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించగా, తెప్పలను ఒడ్డుకు చేర్చే పనిలో మత్స్యకారులు నిమగ్నమయ్యారు. అల్పపీడనం ప్రభావంతో మత్స్యకారులు వేటకు సైతం వెళ్లడం లేదు. గురువారం 1.89 సెం.మీ వర్షపాతం నమోదు కాగా 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో తహశీల్దార్ టి.వి సీతారామయ్య అప్రమత్తమయ్యారు. సముద్రంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని, పూరి గుడిసెలు, చెట్లు కింద ఖాళీ ప్రదేశాల్లో ఉండరాదన్నారు. తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో దండోరా సైతం వేయించారు.



హుకుంపేట-మంచినీళ్లపేట మధ్య కోతకు గురైన తీరం

తీరంలోనే పడవలు

ఈదురుగాలులు ఎక్కువ కావడం, వర్షం కురుస్తుండడంతో తీరం వెంబడి నీరు బురద వర్ణంలోకి మారింది. వేట సాగించే పడవలు, తెప్పలు తీరంలోనే లంగరుకు పరిమతమయ్యాయి. భావనపాడు తీరంలో 70 మోటరైజ్ పడవలు, మరో 120 వరకు సాంప్రదాయంగా వేట సాగించే తెప్పలు తీరానికే పరిమితమయ్యాయి. మంచినీళ్లపేట ఇతర తీరాల్లో మరో 250 వరకు బోట్లు, తెప్పలను సురక్షిత ప్రాంతాల్లో లంగరు వేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు ఆర్ట్స్ కళాశాలలో జెండా పండుగ
- పతాకావిష్కరణ చేయనున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



పోలీసుల కవాతును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పరిశీలించి, పలు సూచనలు చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థులతో పాటు అధికారులు, రాజకీయ ప్రముఖులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు పాల్గొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇరువైపులా త్రివర్ణ పతాకాలను బారికేడ్లకు ఏర్పాటు చేశారు. పోలీస్ పెరేడ్‌తో పాటు ఎన్‌సిసి క్యాడెట్లు, స్కౌట్, గైడ్స్ విద్యార్థులు గౌరవ వందనం అందించనున్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలిసేలా శకటాలు, స్టాల్స్‌ను ప్రదర్శించనున్నారు. ఇందులో ఆకట్టుకున్న మూడు శకటాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నారు.

పటిష్ట బందోబస్తు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే ఆర్ట్స్ కళాశాల మైదానం పరిసర ప్రాంతాలను బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. వేడుకలు నిర్వహించే మైదానం వద్దకు కేవలం విఐపి వాహనాలనే అనుమతించనున్నారు. పలు పాఠశాలల విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు, ఇతర వాహనాలకు కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద పార్కింగ్ స్థలాన్ని కేటాయించనున్నారు.

పెరేడ్ రిహార్సల్స్ పరిశీలన

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పోలీసుల కవాతు రిహార్సల్స్, భద్రత, బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పరిశీలించారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది, పోలీసు బ్యాండ్ సిబ్బంది చేసిన పరేడ్ సాధన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు సాధన నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా సిబ్బంది నుంచి ఎస్‌పి గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించారు. పోలీస్ పరేడ్ సమిష్టిగా, సమన్వయంతో నిర్వహించి ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని సాయుధ బలగాలకు సూచించారు. జాతీయ సమైక్యత, దేశభక్తి, జాతీయభావం వెల్లివిరిసేలా సాధన చేయాలన్నారు. మైదానంలో వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, భద్రత, బందోబస్తుపై చర్చించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాం

'అన్నదాత సుఖీభవ' ర్యాలీలో మంత్రి అచ్చెన్నాయుడు



ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ముఖ్యమైన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండల కేంద్రంలోని ఉమాపాలేశ్వరస్వామి ఆలయం నుంచి కోటబొమ్మాళి వరకు అన్నదాత సుఖీభవ కృతజ్ఞతా ట్రాక్టర్ ర్యాలీ గురువారం నిర్వహించారు. స్వయంగా ట్రాక్టర్‌ను నడిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 14 నెలలోనే సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. ఈ నెలలో లక్ష పైగా స్పౌస్ కోటా పెన్షన్లు మంజూరు చేశామన్నారు. త్వరలోనే వితంతు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచే ఫ్రీ బస్సు పథకం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సి ద్వారా హామీలను నెరవేర్చామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా జిల్లాలో రూ.186 కోట్లతో 2,79,100 మంది రైతులు ఖాతాలకు నిధులు విడుదల చేశామని తెలిపారు. సుమారు 150 ట్రాక్టర్లతో రైతులు పాల్గొన్నారు.

మరో రెండు నెలల్లో పోర్టుకు మొదటి నౌక

శరవేగంగా మూలపేట పోర్టు నిర్మిస్తుమని మంత్రి తెలిపారు. మరో రెండు నెలల్లో మూలపేట పోర్టుకు మొదటి నౌక వచ్చే విధంగా ప్రణాళికాలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. మూలపేట నుంచి భోగాపురం వరకు 8 లైన్ల బీచ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. రహదారులు అభివృద్ధితో టూరిజం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. సంతబొమ్మాళి-కోటబొమ్మాళి రహదారిని అభివృద్ధి చేశామన్నారు. మరో రెండు రోజుల్లోనే డోల-నౌపడ-వెంకటాపురం రోడ్డుకు రూ.వంద కోట్లతో టెండర్లు పిలుస్తున్నామని తెలిపారు.

ఎన్నికల్లో ఓడినప్పుడే జగన్‌కు ప్రజాస్వామ్యం గుర్తొస్తుంది

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎన్నికల్లో ఓడినప్పుడే ప్రజాస్వామ్యం గుర్తొస్తుందని మంత్రి విమర్శించారు. ప్రజలు బుద్ధి చెప్పినా జగన్‌కు అహంకారం తగ్గలేదని అన్నారు. దీనికి నిదర్శనం పులివెందుల, ఒంటిమిట్ట జెడ్‌పిటిసి ఎన్నికలేనని పేర్కొన్నారు. గత 30 ఏళ్లలో ఎప్పుడూ తమ ఓటు వేయలేదని కొంతమంది ప్రజల స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓట్లు వేశారని అన్నారు. బాబాయ్ హత్య, జగన్ అహంకారం వివరిస్తూ ప్రజలు ఓటుతో స్లిప్పులు కూడా రాసి పెట్టారని మంత్రి తెలిపారు.

కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల నాయకులు ఎల్.ఎల్.నాయుడు, రెడ్డి అప్పన్న, కూచెట్టి కాంతారావు, సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి, జీరు భీమారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : కోటబొమ్మాళి చేరుకున్న ర్యాలీని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు స్వాగతం పలికారు. ఈ మేరకు మంత్రిని కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న మత్స్యకారులు (స్పాట్ స్టోరీ, ఈ రోజే రావాలి)

అలుపెరుగని పోరాటం

- కాకరాపల్లి ఉద్యమానికి 15 ఏళ్లు
- 5,479 రోజులుగా నిర్విరామ దీక్ష

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

కాకరపల్లి తంపర భూముల్లో ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీస్ 2640 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు 2010 ఆగస్టు 15న వడ్డితాండ్ర కూడలిలో దీక్షా శిబిరం ప్రారంభమై 15 ఏళ్లు అయ్యింది. 1108 జిఒ రద్దు చేయాలని కోరుతూ ఆ ప్రాంతం మత్స్యకారులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు నిర్విరామంగా 5479 రోజులుగా కొనసాగుతున్నాయి. ఇప్పటికీ వంతులు వారీగా నిరసన చేపడుతున్నారు. అప్పటి ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ ఆధ్వర్యాన 'థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ' ఏర్పడి నిరవధికంగా నిరసనలు ప్రారంభించింది. భూములు, జీవనోపాధి రక్షణకు వడ్డితాండ్ర మత్స్యకారులు, స్థానిక ప్రజలు ఇప్పటికీ ఆ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

ఉద్యమం కాల్పుల దాకా

2011 జనవరిలో పోతునాయుడుపేటలో రెండో దీక్షా శిబిరం మొదలైంది. ఫిబ్రవరి 25న ప్లాంట్ పనుల వాహనాలను అడ్డుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని శిబిరాలను చెరిపివేశారు. పలువురిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు 3,000 మంది భద్రతా సిబ్బంది మోహరించారు. బాష్పవాయువు ప్రయోగంతో ఉద్రిక్తత పెరిగి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. అనంతరం పోలీసులు కాల్పులు చేపట్టగా, సీరపు ఎర్రయ్య, జీరు నాగేశ్వరరావు అక్కడికక్కడే, బత్తిని బారికయ్య ఆస్పత్రిలో మృతి చెందారు. వందలాది గాయపడి, పలువురిని జైలుకు తరలించారు.

మాట తప్పిన హామీలు

ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రాజెక్టును రద్దు చేస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. బదులుగా ఆక్వా జోన్లు ప్రకటించి, బాహ్య పెట్టుబడిదారుల చేత తంపర భూములు రొయ్యల చెరువులుగా మారాయి. తరువాత వైసిపి ప్రభుత్వం కూడా వాటిని రద్దు చేస్తామని చెప్పిన నెరవేర్చలేదని ఉద్యమ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింగరావు, సభ్యులు ఎం.నరోత్తం, రైతు సంఘం నాయకులు కోత మధుసూదనరావు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్వదేశీ మత్స్యకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

లోక్ అదాలత్‌తో వివాదాల పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజలు తమ వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. సెప్టెంబర్ 13న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో ని జిల్లా కోర్టు భవనంలో బీమా సంస్థలు, న్యాయవాదులతో గురువారం సమావేశమ య్యారు. వివాదాలు త్వరగా పరిష్కరించడం ప్రజలకు మేలు చేస్తుందని, ఈ విధానం న్యాయవ్యవస్థపై భారం తగ్గించడంలోనూ తోడ్పడుతుందన్నారు. ఎక్కువ కేసులు రాజీ చేయడానికి బీమా సంస్థలు, న్యాయవాదులు చురుగ్గా ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో చైర్మన్ ప్లాపస్ జి.సువర్ణరాజు, కార్యదర్శి కె.హరిబాబు, జిల్లా న్యాయసేవా ధికార సంస్థ సభ్యులు, బీమా న్యాయవాదులు, బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోలుగు కెజిబివిలో ఆర్‌జెడి విచారణ



కెజిబివి సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగమణి

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని లోలుగు కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఇటీవల బదిలీ అయిన ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్యపై వచ్చిన పలు ఆరోపణలపై కాకినాడ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి గురువారం విచారణ చేపట్టారు. పాఠశాలలోని టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందిని ఒక్కొక్కరుగా పిలిచి పలు అంశాలను తెలుసుకోవడంతో పాటు ఒక ప్రశ్నావళిని ఇచ్చి వాటికి రాతపూర్వకల సమాధానాలు తీసుకున్నారు. పాఠశాలలోని భోజన, వసతి సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులు, బోధనకు సంబంధించి సుమారు 287 మంది విద్యార్థినులకు తెల్ల కాగితాలను ఇచ్చి రాయమని చెప్పారు. అనంతరం పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ఈమెతో పాటు ప్రిన్సిపాల్ ఎస్.లలితకుమారి, తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా గ్రామీణ క్రీడలు

నేటితో ముగియనున్న వజ్రోత్సవ వేడుకలు



సంగిడీలు ఎత్తుతున్న క్రీడాకారుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా గ్రామీణ క్రీడా పోటీలను నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పోలాకి, నరసన్నపేట, శ్రీకాకుళం మండలాలకు చెందిన కర్రసాము ఆటగాళ్లు, ఆమదాలవలస నుంచి సంగిడీల క్రీడాకారులు, పెద్దపాడు నుంచి గూటాల క్రీడాకారులు పాల్గొని పోటీల్లో సత్తా చాటారు.

విద్యార్థుల ప్రతిభ

జిల్లా ఏర్పాటై 75ఏళ్లు పూర్తయిన వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రథమ, మాధ్యమిక విద్యార్థుల కోసం వ్యాసరచన, వాద ప్రతివాదం (డిబేట్), చిత్రలేఖనం పోటీలు రెండు దశల్లో నిర్వహించారు. మొదట నియోజకవర్గ స్థాయిలో 75 మందిని ఎంపిక చేసి, తుది పోటీలు గురువారం పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకరరావు, జిల్లా క్రీడాశాఖ అధికారి కె.శ్రీధర్‌రావు, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి డి.మధుసూదనరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చిన్నకేశవరావు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎగ్జిబిషన్‌లో నియోజకవర్గాల స్టాల్స్ ప్రదర్శన

కోడి రామ్మూర్తి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎనిమిది నియోజకవర్గాల ప్రత్యేకతల స్టాల్స్ రెండో రోజూ సందర్శకులను ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య కాలం నాటి గుర్తులు, స్థానిక తినుబండారాలు, స్వాతంత్ర్య సమరయోధులు, కళాకారులు, సాహిత్యకారులు, చారిత్రక భవనాలు, కళాఖండాలు, చేనేత ఉత్పత్తులు ప్రధాన ఆకర్షణగానిలిచాయి. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్టాల్స్‌ను సందర్శించారు.

నేటితో ముగియనున్న వజ్రోత్సవ వేడుకలు

జిల్లా వజ్రోత్సవాల చివరి రోజు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ శోభతో సాగనుంది. ఉదయం తొమ్మిది గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తి, జాతీయ గర్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు ఈ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణ కానున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి కోడి రామ్మూర్తి స్టేడియంలో ప్రముఖుల సన్మానం, ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల ప్రత్యేక సంగీత విందు అందించనున్నారు. అదే వేదికపై స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ ఎగ్జిబిషన్ కూడా సందర్శకులను అలరించనుంది.

అభివృద్ధి పనులు వేగవంతం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ



సమావేశంలో మాట్లాడుతున్న విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం 1వ, 2వ, 4వ, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్నిశాఖల అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా కవిటి, సోంపేట ప్రాంతాల్లో కిడ్నీ రోగులకు డయాలసిస్ సౌకర్యాలు పెంచడం, అవసరమైన బెడ్లను కల్పించడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలన్నారు. నీటి యాజమాన్య సంస్థ ద్వారా పూర్తయిన పనుల బిల్లులు తక్షణం చెల్లించాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖ కాలం చెల్లిన పనుల జాబితాను సమర్పించాలని సూచించారు. ఉద్దానం పైప్‌లైన్ లీకేజీలను వెంటనే సరిచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా సమస్యలపై స్పందించిన ఆమె, లోవోల్టేజి సమస్యలను పరిష్కరించి గ్రామాలకు నిరంతర విద్యుత్ అందించాలంటూ విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన 3వ, 5వ, 6వ స్థాయీ సంఘాల సమావేశాల్లో కూడా అభివృద్ధి పనుల ప్రగతిని సమీక్షించారు. ప్రజా అవసరాల తీర్చడంలో విభాగాల మధ్య సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తే జిల్లాలో అభివృద్ధి వేగం మరింత పెరుగుతుందని, రాబోయే రోజుల్లో అభివృద్ధి ఫలితాలు ప్రజల దృష్టికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో జిల్లా అధికారులు, జడ్‌పిటిసిలు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం ఎల్‌సి గేటు వద్ద కొత్తగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పలాస ఆర్‌డిఒ వెంకటేష్, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. పట్టణానికి, రూరల్‌కి అనుసంధానంగా నిర్మించనున్న ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ పరిశీలించారు. ఎవ్వరికీ ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వ భూములు, రైల్వే స్థలాలు ఉపయోగించి ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, వార్డ్ కౌన్సిలర్ కాళ్ల దిలీప్, కాళ్ల జయదేవ్ పాల్గొన్నారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పరిసర ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డిటి శ్రీహరి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటోడ్రైవర్లు

'వాహనమిత్ర' అమలు చేయాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వం తక్షణమే ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర పథకం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, ఆటో డ్రైవర్లు యూనియన్ నాయకులు బి.సురేష్. సిహెచ్.రామారావు, తవుడు, సిఐటియు నాయకులు పల్ల కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో, మాక్సీ, క్యాబ్, డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ, ఇప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. ఆటోడ్రైవర్లందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా వర్తింపు చేయాలని అన్నారు. ఆటోడ్రైవర్లకు నష్టదాయకమైన జిఒ 21ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు వాసు. ప్రసాద్, జమ్మయ్య, మాధవ్. ఇల్లయ్య, పకీరు, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.



ఆర్‌ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విప్ అశోక్

ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పాఠశాలకు తద్వారా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిపెట్టాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని బాలికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆర్‌ఒ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడుతూ స్కూల్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మనం తాగే నీళ్లు వృథా కాకుండా వాటిని చక్కగా వాడుకోవాలని పిల్లలకు సూచించారు. అలాగే పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ప్రజలను కోరారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మాచర్ల సుష్మా జ్ఞాపకార్థం మాచర్ల వెంకటసత్యనారాయణ మూర్తి వెయ్యి లీటర్లు సామర్థ్యం కలిగిన అర్‌ఒ ప్లాంట్ విరాళంగా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎం.రాజ్‌కుమార్, పి.దినేష్, మోహన్, వెంకటేష్, కదా రామకోటి, కె.రామారావు, దక్కత కృష్ణమూర్తి పాల్గొన్నారు.



టెక్కలి : ఉట్టి కొడుతున్న చిన్నారులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణభారతీ విద్యా సంస్థల్లో ముందుస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం విద్యా సంస్థల ఛైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి శ్రీకృష్ణుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. చిన్నారులు శ్రీకృష్ణ, రాధా వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ నీలమారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ లీలాలక్ష్మి, విజయ లక్ష్మి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి పట్టణంలోని ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో ముందస్తు కృష్ణామి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన చిన్నారులు శ్రీకృష్ణుని వేషధారణలతో అలరించి పలువురుని ఆకట్టుకున్నారు. కృష్ణుడు, రాధ, గోపికల వంటి వేషధారణలతో పాటు ఉట్టికోట్టే విధానాన్ని పలు జానపద నృత్యలకు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సి ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఆప్కాస్‌ను రద్దు చేసి కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. స్థానిక హైస్కూల్ మైదానంలో ఉన్న మనకినమ్మ ఆలయం ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ మహాసభ సిహెచ్.మురగన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. వర్క్ కాంటాక్ట్



మాట్లాడుతున్న బలరాం

విధానం తెచ్చి కార్మికుల పొట్టకొట్టాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. గతంలో టిడిపి ప్రభుత్వం 279 జిఒ తెచ్చి వర్క్ కాంట్రాక్టు విధానం అవలంబిస్తే పోరాటం ద్వారా వెనక్కి నెట్టామని గుర్తు చేశారు. మరలా అదేవిధానం తెస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సుప్రీం తీర్పు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

ఈ సమస్యలు పరిష్కారానికి ఐక్యంగా పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా సిఐటియు నాయకులు ఎన్.గణపతి, అధ్యక్షునిగా సిహెచ్.మురగన్, కార్యదర్శిగా ఎస్.శంకర్, కోశాధికారిగా ఎం.రవి, కె.బాలకృష్ణ, ఎన్.ఢిల్లీ, అమర్ నాయక్, ప్రకాష్ ముఖి, ఎన్.రమేష్, జీవన బెహరా, ఎస్.ఈశ్వరి, ఎన్.త్రివేణి, ఎం.పుణ్యవతిలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కె.వెంకట్, భాస్కర్, తిరుపతి, ఈశ్వరరావు, గులాబీ, నాని పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మానసిక వికలాంగులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర జర్నలిస్టుల ఫోరం ఉపాధ్యక్షుడు శాసపు జోగినాయుడు అన్నారు. గురువారం నగరంలోని బెహరా మనో వికాస కేంద్రంలో ఆయన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బెహరా మనోవికాస కేంద్రం నిర్వహకులు శేఖర్, శ్యామల, ఎంఎవి సత్య నారాయణ, ఆరవల్లి గృహానంద్, పి.కూర్మారావు, అప్పా రావు, ఈశ్వరరావు, దుర్గాప్రసాద్, కిల్లాడ రాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్ల వజ్రోత్సవం సందర్భంగా ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో పచ్చని చెట్లు నాటుతూ పర్యావరణ హిత సందేశాలు మారుమోగాయి. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీత పట్టణ శివారున ఉన్న టింపని స్కూల్ వద్ద డివైడర్ మధ్యలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనమే ప్రగతికి మెట్లు అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, టిడిపి నాయకులు బోర గోవిందరావు, పివివికె రాజు, రెడ్డి రాంబాబు, బోయిన సునీత, మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బంది నిరసన

ప్రజాశక్తి- నందిగాం

అన్నమయ్య జిల్లా గుర్రంకొండ ఎపిఎం రజనిపై ఇటీవల దౌర్జన్యం చేయడంపై వెలుగు ఎపిఎం మనోరత్నం ఆధ్వర్యాన సిబ్బంది కార్యాలయం ముందు నిరసన తెలిపారు. దాడిని ఖండిస్తూ దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో సిసిలు కూర్మారావు, హైమావతి, భుజంగారావు, పద్మావతి, అకౌంటెంట్ రజిని పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రజనిపై దాడికి నిరసనగా ఎపిఎం సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్.ప్రసాదరావు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. భౌతిక దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విఒఎలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాల బంద్

ప్రజాశక్తి- పలాస

భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని అన్ని మాంసం దుకాణాలు మూసివేస్తున్నట్లు కమిషనర్ నడిపేన రామారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో అందరు కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మాసం దుకాణాలు, చేపల మార్కెట్ పూర్తి వేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- నరసన్నపేట

సారవకోట మండలం అలుదుకు చెందిన లక్కోజు రామారావు అనారోగ్యానికి గురయ్యారు. ఈయన సిఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.41,136 విడుదలైంది. దీనిని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చెక్కును గురువారం అందజేశారు.

'అన్నదాత సుఖీభవ'కు వినతుల స్వీకరణ

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులకు అన్నదాత సుఖీభవ డబ్బులు పడలేదనే వారు ఎవరైనా ఉంటే వారి నుంచి వినతులు స్వీకరిస్తున్నామని ఎఇఒ సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20వ తేదీ వరకు వినతిపత్రాలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులు తమ సమస్యలను గ్రామ సచివాలయాల్లో వ్యవసాయ సహాయకులను కలిసి వినతిపత్రం ఇవ్వాలని తెలిపారు.

ముగిసిన ఎఫ్‌ఎ పరీక్షలు

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన ఎఫ్‌ఎ పరీక్షలు గురువారం ముగిశాయి. సోమవారం ప్రారంభమైన ఈ పరీక్షలు రోజుకు రెండు పరీక్షలు చొప్పున నిర్వహించారు. గురువారం జీవశాస్త్రం పరీక్షతో ముగిశాయి. విద్యా సంవత్సరం నుంచి అమలుకానున్న కొత్త విధానంలోనే పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాల్లోనే విద్యార్థులు పరీక్షలు రాసినా, మూల్యాంకనం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది.

శ్రీకాంత్ పరామర్శ

పలాస : మండలంలోని పుర్ణభద్రలో టొంప శంకర్ తండ్రి బుడ్డయ్య ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ శ్రీధర్ గురువారం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు.

విద్యాభివృద్ధికి మెరుగైన చర్యలు తీసుకోవాలి

ఎంఇఒ కృష్ణవేణి

ప్రజాశక్తి- రణస్థలం

విద్యార్థుల విద్యాభివృద్ధికి మెరుగైన చర్యలు తీసుకోవాలని ఎపిఎంఎస్ అకడమిక్ మోనటరింగ్ అధికారి కృష్ణవేణి అన్నారు. మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న విద్యాశక్తి ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. పాఠశాలలోని విద్యా ప్రమాణాలు, బోధనా పద్ధతులు, మౌలిక సదుపాయాలు వంటి అంశాలను ఆమె సమీక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్, పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు 'విద్యాశక్తి' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్లతో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. 2024-



ఆన్‌లైన్ తరగతులను పరిశీలిస్తున్న కృష్ణవేణి

25లో గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా కొన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలు చేసిందని, ప్రస్తుత విద్యాసంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 5 వేల పాఠశాలల్లో అమలుకు చర్యలు చేపట్టిందని, ఇందులో 4,424 నాన్ రెసిడెన్షియల్, 576 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సందర్శన అనంతరం ఆమె కొన్ని సూచనలు చేశారు. బోధనా పద్ధతులను మరింత మెరుగుపరచాలని, మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

ఉపాధి కాపాడాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో 30 ఏళ్లుగా చిన్నపాటి వ్యాపారాలతో జీవనం సాగిస్తున్న 400 కుటుంబాల ఉపాధిని దెబ్బ కొట్టొద్దని వ్యాపారులు తహశీల్దార్ ఎల్. మధుసూదనరావును కోరారు. గురువారం రోడ్డు విస్తరణ పనుల కోసం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే యంత్రాలు తీసుకువచ్చి పనులు చేపట్టాలని రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులు విస్తరణ పనులు చేపట్టడానికి ప్రయత్నించడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వ్యాపారులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, తమ అభ్యర్థనను మన్నించి వ్యాపారాలు చేసుకోవడానికి అనుకూలంగా రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణ స్థల గుర్తింపు పనులను చేపట్టడం జరిగిందని, వ్యాపారుల అభ్యర్థనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డుకు ఇరువైపులా 35 అడుగుల చొప్పున వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించి అభివృద్ధి పనులకు సహకరిస్తే మిగతా అంశాలపై జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి పరిష్కారం చూపిస్తామన్నారు. ఆర్‌అండ్‌బి జెఇ ఆంజనేయ నాయక్, రెవెన్యూ సిబ్బంది, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారికంగా లచ్చన్న జయంతి వేడుకలు

ప్రజాశక్తి- పలాస

స్వతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఈ నెల 16న రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. వారికి కేటాయించిన బడ్జెట్ నుంచి ఖర్చులను వినియోగించాలని ఆదేశించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

12వ పిఆర్‌సిని నియమించాలి

ప్రజాశక్తి- ఆముదాలవలస

12వ పిఆర్‌సిని తక్షణమే నియమించి 30శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారం పట్టణంలోని ఎన్‌టిఒ కార్యాలయం ఆవరణలో జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఈ తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు మాట్లాడుతూ పెన్షనర్ల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు మాట్లాడుతూ, 12వ పిఆర్‌సి నియామకం 30శాతం ఐఆర్ ప్రకటనపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోశాధికారి హెచ్‌వి సత్యనారాయణ గ్రాట్యుటీ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సరెండర్ లీవ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌టిఒ బి.కృష్ణారావు పెన్షనర్ల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు దాశ్యం లక్ష్మణరావు, బెండి సూర్యనారాయణ, బొడ్డేపల్లి వెంకట రమణ, కార్యదర్శులు పివిఎన్ మాస్టారు, పేడాడ భానుజీరావు, కర్నేన జనార్ధనరావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరమేశ్వరరావు

'ప్రణవి'కి ఎన్‌సిసి సబ్ యూనిట్ మంజూరు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని నౌపడ ఆర్‌ఎస్ వద్ద ఉన్న ప్రణవి కాలేజ్ ఆఫ్ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలకు ఎన్‌ఎస్‌ఎస్ సబ్ యూనిట్ మంజూరైందని పేడాడ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాల ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు కానుందన్నారు. ప్రవేశాలకు అనుమతులు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సు ద్వారా చదువుకునే విద్యార్థులు ఆర్మీ, నేవీ, ఎయిర్‌పోర్స్ వంటి డిఫెన్స్ ఉద్యోగాల్లో ప్రవేశానికి పూర్తిస్థాయి అర్హత పొందుతారని తెలిపారు. సబ్ యూనిట్ మంజూరు చేసిన 14వ ఆంధ్రా ఎన్‌సిసి అధికారులు ఎస్.రమణయ్య, కె.అప్పారావులను అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, అసోసియేట్ అధికారులు కె.రుక్మాంగదరావు, కె.మంజుల, ఎం.కృష్ణారావు, వి.బోగస్వామి, ఆర్.రామారావు, కె.వెంకటరావు, రాయిసునీల్, జి.కుమారి. స్రవంతి, అప్పన్న, సరోజిని, ఢిలేశ్వరరావు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద రోధిస్తున్న భార్యా పిల్లలు

గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి- లావేరు

లావేరుకు చెందిన ఎచ్చెర్ల గొల్ల (50) వరి చేనుకు నీరుకడుతూ గుండె పోటుకు గురై నీటిలో పడిపోయి మృతి చెందాడు. ఈయన ఖాళీ సమయంలో రణస్థలం హైవే పక్కన బస్ స్టాప్ దగ్గర చెప్పులు కుట్టు కుంటూ ఉండేవాడు. శుక్రవారం లావేరులో కౌలుకు తీసుకున్న పొలానికి నీరు కడదామని వెళ్లాడని, వ్యవసాయ బోరు రిపేర్ అవ్వగా మెకానిక్‌ని పిలిపించి రిపేర్ చేయించి, మధ్యాహ్నం సుమారు 3.గంటలకు పొలానికి నీరు కడుతుండగా గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అక్కడ దగ్గరలో ఉన్నవారు లావేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారని తెలి పారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస



స్వప్న (ఫైల్)

మండలంలోని గోపీనగర్ పాఠశాల హెచ్‌ఎం ఎన్.స్వప్న (45) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. బుధవారం విధులకు హాజరైన ఆమె అదేరోజు రాత్రి తీవ్ర గుండె నొప్పితో బాధపడడంతో కుటుంబ సభ్యులు శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. స్వప్నకు భర్త నాగరాజు, కుమార్తె హనీ ఉన్నారు. భర్త నాగరాజు శ్రీకాకుళం ఎస్‌బిఐ ఎడిబిలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండగా, కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతోంది. స్వప్న ఆకస్మిక మరణంపై సహచర ఉపాధ్యాయులు, స్నేహితులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 3న పట్టణంలోని పెద్దమార్కెట్ వద్ద రాజేష్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ హత్య కేసులో మొదటి పట్టణ సిఐ పైడపునాయుడు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు వంశీ కృష్ణ, రామకృష్ణలను శ్రీకాకుళం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

రాయితో దొంగ దాడి

ప్రజాశక్తి- మెళియాపుట్టి



గాయపడిన కాంచన

మండలంలోని పట్టుపురంలో గురువారం దొంగ దాడి ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన అంబల కాంచన ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి, ఇంటి తాళాలు పగలగొట్టి లోపల చోరీకి ప్రయత్నిస్తుంది. ఈ సమయంలో ఇంటికి

క్రైమ్ కార్నర్

వచ్చిన కాంచన, అనుమానాస్పదంగా ఇంట్లో ఉన్న వ్యక్తిని చూసి మీరు ఎవరు అని ప్రశ్నించగా, ఆ దొంగ ఆమెపై తిరగబడి దగ్గరలో ఉన్న పెద్ద రాయితో తలపై కొట్టారు. తీవ్ర గాయాలతో కాంచన కుప్పకూలగా, దుండగురాలు అక్కడి నుంచి పరారైంది. గాయపడిన కాంచనను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు ఏర్పడినట్లు తెలుస్తోంది.

బంగారం చైన్ చోరీ




దాతమ్మ

కోటబొమ్మాళి: కోట బొమ్మాళి సమీపంలో గురువారం నరసాపురానికి చెందిన బొమ్మాళి దాలమ్మ మెడలో గుర్తుతెలియని యువకుడు చోరీకి పాల్పడ్డాడు. దాలమ్మ కోటబొమ్మాళిలో బజారు చేసుకుని తిరిగి నడుచుకుంటూ తన గ్రామానికి వెళ్తుంది. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తెంపుకొని వెళ్లిపోయాడు. ఆ సమయంలో దగ్గరలో ఎవరు లేకపోవడంతో. ఆగంతకుడు తప్పించుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

ప్రజాశక్తి- పొందూరు



మృతి చెందిన ఆవుదూడ

మండలంలోని కృష్ణాపురంలో కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఆవు దూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన కెల్ల లక్ష్మీ పార్వతి తన ఆవు దూడను ఇంటి వెనక మేతకని విడిచి పెట్టింది. ఇంతలో 10 నుంచి 15 కుక్కలు గుంపుగా చేరి ఆవు దూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సమీపంలో ఉన్నవారు చూసి కుక్కల గుంపును తరిమి కొట్టారు. అయితే కొద్దిసేపటికి ఆవుదూడ మృతి చెందడంతో రైతు విలపించారు. గ్రామంలో ఇదే విధంగా కుక్కలు నిత్యం పశువులపై దాడి చేయడంతో పాటు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులను సైతం బయటకు విడిచి పెట్టాలంటే భయంగా ఉందని ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాపోతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను తక్షణమే నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలంటే గ్రామస్తులు కోరుతున్నారు.

వివాహేతర సంబంధంతోనే హత్య

డిఎస్‌పి లక్ష్మణరావు


ప్రజాశక్తి- పాతపట్నం

మండల కేంద్రంలోని మొండి గొల్లవీధికి చెందిన నల్లి రాజు హత్యకు వివాహేతర సంబంధమే కారణమని టెక్కలి డిఎస్‌పి లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ



మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మణరావు

మృతుడి భార్య మౌనికకు మాదిగ వీధికి చెందిన గుండు ఉదయ్‌కుమార్‌తో కొన్నేళ్ల క్రితం అక్రమ సంబంధం ఏర్పడిందన్నారు. ఈ విషయం రాజుకు తెలియడంతో కొంతకాలంగా భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయన్నారు. రాజును అంతం చేసి, ఉదయ్ తన భార్యకు కూడా విడాకులు ఇచ్చి, ఇద్దరు కలిసి ఎక్కడికైనా వెళ్లి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారని, ఇందులో భాగంగా రాజు హత్యకు ఇద్దరూ కలిసి పథకం రచించారన్నారు. కొత్త ఫోన్ నెంబర్‌తో అమ్మాయిలా వాట్సప్‌లో గత రెండు నెలలుగా రాజుతో చాటింగ్ చేసి, ఎక్కడికైనా ఏకాంత ప్రదేశానికి రప్పించి, దాడి చేసి చంపాలనుకున్నారన్నారు. ఆ విధంగా పలుమార్లు ఉదయ్ అమ్మాయిలా రాజుతో చాట్ చేసినప్పటికీ ఆయన స్పందించలేదన్నారు. దీంతో ఇరువురు రాజును ఇంటిలోనే నిద్రమాత్రలు ఇచ్చి మత్తు కలిగించి ఆ తరువాత చంపాలని కుట్ర పన్నారన్నారు. అందుకోసం ఉదయ్ తన బావ మల్లికార్జున సహాయం కోరాడన్నారు. వారి కుట్రలో భాగంగా ఉదయ్ పర్లాకిమిడిలో ఒక ఆర్‌ఎంపి డాక్టర్ వద్ద నిద్రమాత్రలు కొనుగోలు చేసి మౌనికకు ఇచ్చాడన్నారు. ఈనెల 6న రాత్రి ఆరు మాత్రలను రాజుకు భోజనంలో కలిపి పెట్టిందన్నారు. అది తిన్న రాజు గాఢ మత్తులోకి వెళ్లిపోయడన్నారు. అనంతరం ప్రియుడు ఉదయ్‌ని తన ఇంటికి రమ్మని ఫోన్ చేసిందన్నారు. తలగడతో రాజును ఊపిరి ఆడకుండా చేసి అంతమొందించారని తెలిపారు. సమావేశంలో సిఐ రామారావు, ఎస్ఐ లావణ్య ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ అమీర్ అలీ

8 బైక్‌లు స్వాధీనం


ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లమ్మ పంచాయతీ మహాసింగి గూడలో గురువారం వేకువ జామున ఎస్ఐ ఎంఎ అమీర్ అలీ ఆధ్వర్యాన కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిది బైక్‌కు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామంలో సంచరించినట్లయితే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి కోటేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న అండర్‌పాసేజ్

ప్రజాశక్తి- పొందూరు

చిన్నపాటి వర్షానికి నిండుకుండలా మారి చెరువును తలపిస్తున్న ఈ రైల్వే అండర్‌పాసేజ్ మండలంలోని పెనుబర్తి గ్రామం సమీపంలోనిది. రెండు రోజులుగా కురుస్తున్న అడపాదడపా వర్షానికి పెనుబర్తి - గోరింట గ్రామాల మధ్య గల రైల్వే అండర్‌పాసేజ్‌లో నిండుగా నీరు చేరిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందంటూ పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం శ్రీకాకుళం వెళ్లేందుకు తుంగపేట, లైదాం, గోరింట, గోకర్ణపల్లి, సంతకవిటి మండలంలోని సిరిపురంతో పాటు పలు గ్రామాల ప్రజలు ఈ రైల్వే అండర్‌పాసేజ్ ద్వారానే ప్రయాణాలు సాగిస్తుంటారు. ప్రస్తుతం అండర్‌పాసేజ్‌లో నిండుగా వర్షపునీరు చేరిపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామంటూ ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



చెరువులా కనిపిస్తున్న అండర్‌పాసేజ్

చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఈ విధంగా రాకపోకలు సాగించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం రైల్వే అధికారులు చూపించాలంటూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ పురస్కారాలకు 169 మంది ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో 169 మందికి ఉత్తమ పురస్కారాల కోసం ఎంపిక చేశారు. 71 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 163 మందిని ఉత్తమ సేవకులుగా సిఫార్సు చేశారు. ఇందులో జిల్లా పోలీసు శాఖ నుంచి 20 మందిని ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు. స్వచ్ఛంద సంస్థల నుంచి ఆరుగురికి పురస్కారాలు అందించాలని నిర్ణయించారు. పురస్కారాల్లో అధికారుల కంటే సిబ్బందికి ప్రాధాన్యం ఇచ్చారు. జిల్లా యూనిట్‌గా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు అవార్డులు అందజేయనున్నారు. అవార్డుల ఎంపికలో వడపోత అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేయడంతో అందుకనుగుణంగా అర్హతా ప్రమాణాలు పాటించారు.

అన్ని శాఖల నుంచి 400 పేర్లు ప్రతిపాదన చేయగా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యాన అవార్డుల ఎంపిక కమిటీ తుది జాబితాను సిద్ధం చేసింది. గతేడాది 250 మందికి పైగా అవార్డులు అందజేశారు. ఈ ఏడాది ఆ సంఖ్యను 169కి కుదించారు. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన జాబితాలు పరిశీలించి వారి పనితీరు ఆధారంగా అవార్డు కమిటీ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం చొరవతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ఎన్నో ఏళ్ల కల నెరవేర్చిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్, ఉపాధి హామీ, హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2018-19లో ఉపాధి హామీ నిధులతో రోడ్లు, మినీ గోకులాలు, హౌసింగ్, రోడ్ల పక్కన మొక్కలు నాటిన వాళ్లకి వైసిపి ప్రభుత్వం 21 శాతం డబ్బులను విత్ హోల్డ్ చేసిందని అన్నారు. మరో పది నుంచి పదిహేను రోజుల్లో కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు.



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక కెజిబివిలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు గాంధీ, కస్తూరిబాల విగ్రహాలను గురువారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాలకు ఆర్థికసాయం అందించిన బత్తుల వెంకటరమణని ప్రిన్సిపాల్ శిరీష, అలయన్స్ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తి ప్రదాతలు గాంధీజీ, కస్తూరిబాల గొప్పదనాన్ని వివరించి వారిని ఆదర్శంగా తీసుకొని జీవితాలను ఉన్నంతంగా తీర్చుదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో లాభాల వెంకటరావు, ప్రకాశరావు, రావి జయకృష్ణ, దక్కత గోపి, చాట్ల లోహిదాసు పాల్గొన్నారు.

'108' పరిశీలన

నందిగాం : మండలానికి చెందిన 108 వాహన సేవలను జిల్లా మేనేజర్ ఎల్.నవీన్‌కుమార్ గురువారం పరిశీలించారు. వాహనంలోని రికార్డులతో పాటు పరికరాలను పరిశీలించి వాటి పనితీరు గురించి వాటిని అప్పటికప్పుడు శుభ్రం చేసి వాటిపై అవగాహన పొందాలన్నారు. అత్యవసర సమయాల్లో ఎటువంటి ఆలస్యం చేయకుండా సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ కె.చినబాబు ఇఎంటి రాము, పైలెట్ రాజేష్ ఉన్నారు.



మొక్కను నాటుతున్న మధు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- పోలాకి

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎల్.వి.మధు అనారు. జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న గుర్తుగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.ప్రకాష్, తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎఒ, మండల పరిషత్, ఎన్‌ఆర్‌జిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం సమస్య పరిష్కారం

ఇచ్ఛాపురం : పట్టణంలో బెల్లుపడ కాలనీలో దశాబ్ద కాలంగా ఉన్న సమస్యను సొంత ఖర్చులతో టిడిపి కార్యదర్శి శాసనా శేఖర్ పరిష్కరించారు. అమ్మవారి ఆలయం ఆర్చి ఎదురుగా ఉన్న కాలనీ రోడ్డు పక్కన కాలువ మధ్యలో ఓ ఇనుప విద్యుత్ స్తంభం నిరుపయోగంగా ఉండిపోయింది. దీనివల్ల కాలువలో చెత్త, మురుగు నీరు నిల్వ ఉండటమే కాకుండా వర్షాలు పడినపుడు మురుగు నీరు కాలనీలోకి వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈ సమస్యను శేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. శేఖర్ విద్యుత్‌శాఖ ఇఇతో మాట్లాడారు. ప్రొక్లెయినర్ సహాయంతో శ్రమదానం చేసి ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. పదేళ్లుగా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పట్టించుకోని సమస్యను శేఖర్ పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపాలాచారి పాల్గొన్నారు.



తొలగిస్తున్న విద్యుత్ స్తంభం

శక్తి యాప్‌పై అవగాహన

ఆముదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎఎస్ఐ డి.రమణమూర్తి శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు ఆపద సమయంలో రక్షణ పొందడానికి శక్తి యాప్ శక్తివంతమైన సాధనం అని అన్నారు. అలాగే గృహహింస, వరకట్న వేధింపుల కోసం 181, అత్యవసర సేవలకు 112, మహిళా వేధింపులు, అక్రమ రవాణాకు 1091, పిల్లలపై లైంగిక వేధింపులకు 1098, సైబర్ నేరాలకు 1930 నంబర్లకు కాల్ చేస్తే శక్తి టీమ్ తక్షణం సహాయం అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్యాంసుందర్, జె.రవిబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- పొందూరు

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డిపాజిట్లు, రుణాలు, ప్రభుత్వ పథకాల అమలు, ఆర్థిక అంశాలపై చర్చించారు. సెర్ప్ సంస్థ ఆదేశాలను పాటించాలని సూచించారు. పిఎం ఫసల్ బీమా యోజనను అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లికి చెందిన నర్సింగపల్లి సేవా సంఘం వారి ఔదార్యంతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 50 కుర్చీలు వితరణగా ప్రధానోపాధ్యాయులు యుత్తరకవాటం గణపతిరావుకి గురువారం అందించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన సింగుపురం ప్రియాంక, దారపు రేష్మశ్రీ, సార సందీప్‌ల ఉన్నత చదువుల దృష్ట్యా నగదు పురస్కారాన్ని అందించారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమని హెచ్‌ఎం గణపతిరావు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు, దారపు ధర్మారావు, పొట్నూరు శంకరరావు, పొట్నూరు సంతోష్, ఉపాధ్యాయులు ఇసంపల్లి చిన్నవాడు, యరపత్ని వెంకటరమణ, సకలాబత్తుల శ్రీనివాసరావు, దొంకాన పాపారావు, ఎస్.కె.వాసు, హైమావతి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



కుర్చీలు అందజేస్తున్న నిర్వాహకులు

'ఐతమ్'లో చేతి కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవం వేడుక సందర్భంగా శాక్ ఇన్‌ఛార్జ్ కె.సురేష్, బి.గోపాల్‌కృష్ణ ఆధ్వర్యాన గురువారం విద్యార్థులు తమ చేతి కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలో చేతితో వేసిన బొమ్మలు, రంగులుదిద్దడం, చేతితో తయారు చేసిన అల్లిక బహుమానాలు, పోస్టర్లు వంటి వస్తువులు ఉంచారు. ఈ ప్రదర్శనలను డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సందర్శించారు. ఇలాంటి కళల ద్వారా విద్యార్థుల్లో మరింత నైపుణ్యత పెంచుకోవచ్చునని అన్నారు. ఈ సందర్భంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ డి.యుగంధర్, డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ డి.శాంతికుమార్‌లు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

అవుట్‌పోస్టు ప్రారంభం

టెక్కలి రూరల్ : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల 12 టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో అవుట్ పోస్టు లేకపోవడంతో ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పి ఆదేశాల మేరకు డిఎస్‌పి పర్యవేక్షణలో గురువారం పోలీసులు అవుట్ పోస్టు ప్రారంభించారు. కార్యక్రమంలో పోలీసు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



జబర్దస్త్ నటుడు గణపతిని సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా సిక్కోలు వజ్రోత్సవాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సరుబుజ్జిలి మండలంలోని దంతపురి వద్ద డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో చిక్కోలు వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దంతపురి వద్ద ఉన్న బుద్ధుడి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అక్కడ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చిక్కోలు వజ్రోత్సవాలను పురస్కరించుకొని కళాకారుల ప్రతిభను గుర్తుచేసుకొని జబర్దస్త్ జిల్లా నటుడు పేడాడ గణపతికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సన్మానంలో ఎంపిడిఒ ఎం.పావని, పిఎసిఎస్ డైరెక్టర్ పైడి మురళీమోహన్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ బెలూన్ ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : జిల్లా వజ్రోత్సవాలు వేడుకల్లో భాగంగా ఇచ్ఛాపురం పురపాలక సంఘం ఆవరణలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మిలు గురువారం గ్యాస్ బెలూన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, వార్డు మెంబర్లు పత్రీ తవిటయ్య, కాళ్ల దిలీప్, లాలారాణి, కాళ్ల జయదేవ్, నందిక జాని, జన్నెల సంతోష్, ఎస్.శేఖర్, ఆసి మోహన్ పాల్గొన్నారు.



ఎగురుతున్న గ్యాస్ బెలూన్

సురక్ష శిక్షణలో అవగాహన

శ్రీకాకుళం: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని శశిధర్ ఆస్పత్రి వైద్యులు వినీషా (సైకియాట్రిస్ట్), డా. శశిధర్ (డగ్ డీ-అడిక్షన్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, సేఫ్టీ మెజర్స్, వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అంశాలపై ఈస్టరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ నిర్వహించిన సురక్షా ట్రెనింగ్ ప్రోగ్రామ్‌లో జెఎల్‌ఎం (గ్రేడ్-2 ఎనర్జిస్ట్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.వినీషా మాట్లాడుతూ డిప్రెషన్, ఇతర మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి సహాయం అందించడానికి అందుబాటులో ఉంటామని తెలిపారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

లావేరు : ఆర్థిక లావాదేవీలపై అవగాహన అవసరమని, మనడబ్బులు మనలెక్కలపై సభ్యులు అవగాహన కలిగి ఉండాలని డిపిఎం ఐబి మోహనరావు అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్యలో ఎండిఎంఎల్ మనడబ్బులు, మనలెక్కలుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్వయం శక్తి సంఘాలకు ప్రతినెలా ప్రతి సంఘం సమావేశం నిర్వహించుకొని ఆర్థిక లావాదేవీలు చర్చించుకొని తీర్మానాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం ఐబి భాగ్యలత, ఎల్‌సి నాగరాజు, మండల సమాఖ్య అధ్యక్షులు లుట్ల కోటమ్మ, ఎపిఎం బివి సుబ్బయ్య నాయుడు, సిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా

పోలాకి : మండలంలోని పోలాకి, పిన్నింటిపేట గ్రామాల్లో చింతాడ భారతి ఆధ్వర్యాన గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. శారదా స్కూల్ విద్యార్థులతో త్రివర్ణ పతాకాన్ని పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపైనా తిరంగా ఎగురు వేయాలని వివరించారు. అనంతరం ఎస్ఐ రంజిత్‌కి జెండాను అందించారు. కార్యక్రమంలో తేజేశ్వరరావు, కె.రామారావు, ఎండ శ్రీను, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ఎస్ఐకి జెండాను అందజేస్తున్న స్కూల్ యాజమాన్య ప్రతినిధులు





శుక్రవారం 15-8-2025 | శ్రీకాకుళం జిల్లా | 8 పేజీలు



వజ్రోత్సవ శ్రీకాకుళం



బి.తులసీదాస్

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయ్యాయంటూ ఉత్సాహంగా వజ్రోత్సవం జరుపుకోవడం సంతోషదాయకం. జిల్లాకు 75 ఏళ్లు అయిందని మురిసిపోతున్న జనం శ్రీకాకుళానికి క్రీస్తు పూర్వం ఏడో శతాబ్దం నాటి నుండి చరిత్ర ఉందంటే ఇంకెంతో సంబరం కదా! అంతకుముందరి ఆనవాళ్లు కూడా ఉన్నా కనీసం మూడు వేల ఏళ్ల ఘనచరిత్ర గలది మన శ్రీకాకుళం. 'దేశమంటే మట్టి కాదోయ్– దేశమంటే మనుషులోయ్' అన్నాడు మహాకవి గురజాడ. కనుక ఈ జిల్లా ప్రజలు తరతరాలుగా తమ జీవితాల్తో, వైవిధ్యభరిత జీవన విధానంతో లిఖించిన సజీవ చరిత్ర అది. మొన్న నిన్న ఏం జరిగిందన్నది ఆకళింపు చేసుకొని నేడు జరుగుతున్నదేమిటో సక్రమంగా పరిశీలిస్తే రేపు జరగబోయేదేమిటో, మనం ఎలా వ్యవహరించాలో దారి తెలుస్తుంది. చరిత్ర ప్రాధాన్యత అదే! శ్రీకాకుళం అంటేనే వెనుకబడిన జిల్లా అనీ.. వలసల జిల్లా అనీ కొందరు అంటారు కానీ ఆ వెనుకబాటుకు కారణం పాలకుల నిర్లక్ష్యం తప్ప వనరుల లేమి కాదు. ఈ జిల్లా ప్రజలకు నైపుణ్యం లేదని ఎవరూ అనరు, అనలేరు. శ్రమించే తత్వం అద్వితీయం.

చారిత్రక వారసత్వం

దంతపురి, శాలిహుండం, సంగమయ్య కొండ, శ్రీముఖలింగం తదితర చారిత్రక ప్రదేశాలను పరిశీలిస్తే జిల్లాలో బౌద్ధ, జైన సంస్కృతులు నెలకొని ఉండేవని తేటతెల్లమవుతుంది. ఇప్పటికీ గుర్తించని బౌద్ధ, జైన అవశేషాలెన్నో జిల్లాలో ఉన్నాయి. అంతేగాక పాత రాతియుగంనాటి ఆనవాళ్లు కూడా ఉన్నాయని, ఆదిమానవుల నాటి చిత్రాలు కొన్ని కొండలపై నిక్షిప్తమైనాయనీ పురావస్తు పరిశీలకులు చెబుతున్నారు. వాటిపై శాస్త్రీయ పరిశోధనలు చేసి నిర్ధారించాల్సి ఉంది. దశావతారాల్లో ఒకటిగా చెప్పబడే కూర్మావతానికి చిహ్నంగా శ్రీకూర్మం, నిత్య పూజ జరిగే సూర్య దేవాలయంగా అరసవిల్లి ప్రసిద్ధి చెందినవి. జైన, బౌద్ధ, శైవ శిల్పకళ గల శ్రీముఖలింగం ఆలయాలు, అవశేషాలు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఉన్నాయి. శ్రీకాకుళం పట్టణం నడిబొడ్డునగల జామియా మసీదు పురాతనమైన, విశాలమైన

మిగతా 2లో

ప్రాచీన శ్రీకాకుళం

భారతదేశ చరిత్రకు తొలి సాహిత్య ఆధారాలు నాలుగు వేదాలు. శిలాశాసనాలు స్పష్టమైన ఆధారాలు. సైన్స్ అభివృద్ధి చెందిన తర్వాత మట్టి, రాళ్లు కూడా చారిత్రక ఆధారాలుగా మారాయి. 1950 నాటికి కాలాన్ని నిర్ణయించే 'రేడియో కార్బన్' పద్ధతి వచ్చింది. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా తూర్పు కనుమలను ఆనుకుని ఉన్న ప్రాంతం. తూర్పు కనుమల్లోని శిలలకు 'ఖోండ్ లైట్స్ అని శాస్త్రవేత్తలు నామకరణం చేశారు. ఇవి మన రాష్ట్రంలోకెల్లా పురాతనమైనవి. ఆదిమానవుల సంచారం, కొన్ని లక్షల ఏళ్ల నాటి మానవ సమూహాలు, తెగలు ప్రస్తుత శ్రీకాకుళం జిల్లాలోనూ సంచరించేవి. బృహత్ శిలాయుగం నాటి సమాధులుగా ప్రస్తుత ఆమదాలవలస మండలంలోని 'దన్నానపేట' దగ్గర కన్పిస్తున్న శిలారూపాలను తాజాగా గుర్తించింది. మానవ సమాజంలో 'తెగల వ్యవస్థ క్రీస్తుకు పూర్వం కొన్ని వేల సంవత్సరాల నాటిది. ఇటువంటి తెగల్లో ప్రస్తుతం మనం చూస్తున్న 'సవర' తెగ ఒకటి. రుగ్వేదానికి అనుబంధంగా సృష్టించిన ఐతరేయ బ్రాహ్మణాం క్రీ.పూ 1500 నాటిది. ఇది ఆంధ్రులతో పాటు సవరలను కూడా ప్రస్తావించింది. వీరిని విశ్వామిత్రుని సంతానంగా వివరించింది. రామాయణంలోని 'శబరి', సవరుల ఆడపడుచే. 'శబర' అనే మాటకు అర్థం 'సవర' అని చరిత్రకారులు నిర్ధారించారు. ఐతరేయ బ్రాహ్మణంలో సవరలతో పాటు 'పుండ్ర' తెగ పేరు ప్రస్తావించింది. మహాభారతంలో పుండ్రతో పాటు 'కళింగ పేరు కన్పిస్తుంది. వేదాల్లో 'కళింగ' ప్రస్తావన లేకపోయినా, వీరి మూలపురుషుల్లో దీర్ఘతమసుడి పేరు కన్పిస్తుంది. మహాభారత యుద్ధంలో కళింగులు, కౌరవులకు మిత్రులు. ఈ యుద్ధం క్రీ.పూ.1400–1200 మధ్య జరిగిందని పరిశోధకుల అభిప్రాయం . నేటికీ, శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి డివిజన్‌లో 'దుర్యోధన' పేరు గల వారు కనిపిస్తారు.భారతదేశ చరిత్రకు స్పష్టమైన ఆధారాలు 'మహాజన పదాలతో కన్పిస్తాయి. క్రీ.పూ.600 నాటికి దేశంలో 16 మహాజనపదాలు ఏర్పడ్డాయి. 'మహాజనపదం' అంటే మహా సామ్రాజ్యం. వీటిలో చివరికి మిగిలింది కాశీ, కోసల, మగధ, వజ్జియా, ఈ నాలుగింటి మధ్య నూరేళ్ల యుద్ధాలు జరిగాయి. చివరికి, విజేతగా నిలబడింది మగధ. మగధ సరిహద్దు రాజ్యమే కళింగ. మగధను పాలించిన మౌర్య బింబిసారుని కాలానికి (క్రీ.పూ.297), దేశమంతా వారి వారి ఆధీనంలోకి వచ్చింది. ఒక్క కళింగనే జయించలేకపోయారు. అశోకుని కాలంలో ఇది సాధ్యమైంది. కళింగ దండయాత్ర (క్రీపూ.260) చరిత్ర గతినే మార్చిన మహా విషాదకర పరిణామం. ఈ పరిణామం తరువాత అశోకుడు వేయించిన శాసనాల్లో 'జాగఢ' ఒకటి. ఇది బరంపురానికి దాదాపు 40 కి.మీ దూరంలో ఉంది. ఈ శాసనంలో 'దేవానాంప్రియుడు' (అశోకుడు) శివ ఆటవిక జాతులతో సమాధానపడుతున్నాడు' అని ప్రకటించుకున్నాడు. అంటే, ఆనాటికి కళింగ ప్రాంతాన్ని కొన్ని ఆట జాతులు పరిపాలిస్తున్నట్లు అర్థమవుతోంది.

గంగులు కర్ణాటకలోని కోలాహలపురానికి (కోలార్) చెందిన వారు. ఈ వంశానికి చెందిన వీరసింహుడనే రాజుకు ఐదుగురు కుమారులు. వారు తమ తల్లిని తీసుకుని నేరుగా మహేంద్రగిరి వెళ్లి, గోకరేశ్వరుని ప్రతిష్టించారు. అతడి ఆదేశం మేరకు రాజ్యం స్థాపిస్తున్నామని చెప్పుకున్నారు. వీరి తొలి రాజధాని దంతపురం. రాజ్యం విస్తరించడంతో నగరికటకాన్ని నిర్మించి రాజధానిని తరలించారు. సంస్కృతాన్ని ప్రోత్సహించారు. శ్రీముఖలింగం, శ్రీకూర్మం, అరసవిల్లి, సింహాచలం వంటి చోట్ల ఆలయాలను నిర్మించారు. ఒక దశలో గంగా-కావేరి నదుల వరకూ వీరి రాజ్యం విస్తరించింది. దాదాపు వెయ్యి సంవత్సరాలు ఈ వంశం రాజ్యపాలన చేసింది. భారతదేశ చరిత్రలో ఇంత సుదీర్ఘంగా పాలించిన రాజవంశం మరొకటి లేదు. క్రీ.పూ.1014 నాటికి రాజ్యం బాగా విస్తరించడంతో రాజధానిని నగరికటకం నుంచి కటకానికి(కటక్) మార్చారు. ప్రస్తుత ఒడిశాలో వీరు నిర్మించినవే కోణార్క్, పూరీ, భువనేశ్వర్ ఆలయాలు. ఈ వంశంలో మితవర్మ తొలిపాలకుడు కాగా, చివరివాడు నాల్గవ వీరభానుదేవుడు. గంగ వంశపాలన ముగిసిన తరువాత కపిలేంద్ర గజపతి అధికారం చేపట్టారు. గజపతుల పాలన క్రీశ.1439 నుంచి 1538 వరకూ సాగింది. ఈ వంశానికి చెందిన ప్రతాపరుద్రుని కాలంలోనే శ్రీకృష్ణదేవరాయలు శ్రీకాకుళం జిల్లా మీదుగా కటక్‌పై మూడు సార్లు దండయాత్రలు చేశాడు. ప్రతాపరుద్రుని మరణం తరువాత, అతని మంత్రి గోవిందవిద్యాధరుడు కొన్నాళ్లు పాలించాడు. 1572 నాటికి గోల్కొండ నవాబుల పాలన మొదలైంది.

శిరసెత్తిన శ్రీకాకుళం

మాఠర, గంగ వంశాలు స్థానికమైనవి కాకున్నా ప్రస్తుత శ్రీకాకుళం మట్టిపై స్థిరపడి గంగా-కావేరి నదుల మధ్య ప్రాంతాల్లో తమ శక్తి యుక్తులను ప్రదర్శించడం, శ్రీకాకుళం చరిత్ర, సంస్కృతిలో ఒక గర్వకారణమైన పరిణామం. క్రీశ.350 నాటికే పిఠాపురం నుంచి దక్షిణ కళింగను పాలిస్తున్న వాశిష్టీపుత్ర శక్తివర్మ మనుమడు రెండో శక్తివర్మ సింహపురం కేంద్రంగా రాజ్యాన్ని స్థాపించాడు. ఇతని (కటక్) వారసులు క్రీ.శ.440 వరకూ పాలించారు. నేటి శ్రీలంక, సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్ దేశాలతో సంబంధ, బాంధవ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. సింహపురం-సింహళం (శ్రీలంక), సింగుపురం - సింగపూర్ పేర్ల మధ్య సామీప్యాన్ని గమనించవచ్చు. వీరి పాలన అంతరించిన తరువాత ఈ ప్రాంతంపై విష్ణుకుండినులు దాడులు జరిపారు. ఈ నేపథ్యంలోనే క్రీ.శ.496లో గంగ వంశరాజ్యం ఏర్పడింది.

- నల్లి ధర్మారావు

సిక్కోలు పునాది చికాకోల్

గోల్కొండ నవాబు కులీకుతుబ్ షా కాలంలో పాలనా కేంద్రీకరణలో 'సుబా'లు లేదా 'పరగణా'లు ఏర్పడ్డాయి. వాటిలో 'చికా కోల్' ఒకటి. చికాకోల్ పాలకుడిని 'ఫౌజ్‌ధార్' అనే వారు. నవాబు నియమించిన తొలి ఫౌజ్ ధార్ షేర్ మహ్మద్ ఖాన్ (1562–1684). అతని పేరుతో నిర్మించిందే షేర్ మహ్మద్ పురం. ఫౌజుదారుల్లో చివరివాడు అన్వరుద్దీన్ ఖాన్(1925–40). షేర్ మహ్మద్ ఖాన్ సైన్యంలో పని చేసిన వారిలో ఇద్దరినీ, గ్రామాల గుత్త దారులగా ఖాన్ నియమించి, వారికి కొన్ని గ్రామాలను కేటాయించారు. వారే విజయనగరం, బొబ్బిలి జమిందార్లుగా ఎది గారు. షేర్ మహ్మద్ కాలంలోనే శ్రీకాకుళంలో జామియా మసీదు, మరో 364 మసీదుల నిర్మాణం జరిగాయి. గోల్కొండ నవాబుగా సలాబత్ జంగ్ ఉన్నప్పుడు, 1753లో ఫ్రెంచి సేనాని బుసీతో ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం చికాకోల్ ఫ్రెంచివారి పరమై 1759లో ఫౌజ్‌దార్ల పాలన అంతమైంది. విజయనగరం, బొబ్బిలి ప్రధాన జమిందారీలు కాగా, చిన్న జమిందారీలతో వార శత్రువులై రెండు శిబిరాలను నడిపారు. ఫ్రెంచ్, ఇంగ్లీష్ వారికి వాడుకోబోయి, చివరకు వారి చేతిలోనే కీలుబొమ్మలయ్యారు. 1766లో బ్రిటిష్ వారి తూర్పు ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైంది. బ్రిటిష్ పాల నకు వ్యతిరేకంగా భారతీయులు పోరాడితే 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1936లో ఒడిశా ఏర్పడిన తరువాత, 1950లో శ్రీకాకుళం జిల్లా ఏర్పడింది. ముస్లిం ప్రభావం గల 'చికాకోల్'ను 1947 తరువాత శ్రీకాకుళంగా మార్చారు. భారతదేశాన్ని గణతంత్ర రాజ్యంగా ప్రకటించిన సంవత్సరమే శ్రీకాకుళం జిల్లా ఏర్పాటు ఖరారు కాగా, ఆ ఏడాది ఆగస్టు 15న ప్రత్యేకంగా జిల్లాగా ప్రకటన వెలువడింది. 'చికాకోల్‌ను గ్రామీణులు సరిగ్గా పలకలేక 'చిక్కోల్' అనేవారు. శ్రీకాకుళమైన తరువాత 'చిక్కోలు' సిక్కోలు' అయింది.

కటక్ నుంచి పిఠాపురం వరకు

ప్రసుత కటక్ (ఒడిశా) నుంచి పిఠాపురం (ఆంధ్రప్రదేశ్) వరకూ విస్తరించిన ప్రాంతాన్నే 'కళింగ'గా చరిత్రకారులు నిర్ధారించారు. జాగడ శాసనం తరువాత, కళింగ చరిత్రకు రెండో శాసనాధారం ఖారవేలుని ఖండగిరి–ఉదయగిరి శాసనం (హతిగుంప). మగధ పాలకులైన మౌర్యులను ధిక్కరించి ఖారవేలుడు స్వతంత్ర కళింగ రాజ్యాన్ని ప్రకటించుకున్నాడు. 'ఛేది' వంశానికి చెందిన ఇతడు క్రీ.పూ.183లో తన 24వ ఏట పట్టాభిషిక్తుడయ్యాడు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా వరకు ఇతని ఆధీనంలోకి వచ్చింది. అశోకుని కాలంలో బౌద్ధ మతం వ్యాపించగా, ఖారవేలుని కాలంలో జైన మతం అభివృద్ధి చెందింది. శ్రీకాకుళం జిల్లాలోని దంతపురం, శాలిహుండం, జగతిమెట్ట, కళింగపట్నం అశోకుని కాలంలో వెలసిన బౌద్ధ కేంద్రాలు. ఖారవేలుని కాలంలో జైనమతం వ్యాపించిందని చెప్పడానికి సంగమయ్యకొండ, ముఖలింగం, విష్ణుకొండ వంటి చోట్ల ఆధారాలు కన్పిస్తాయి. ఖారవేలుడి తరువాత దాదాపు నాలుగు శతాబ్దాల కళింగ చరిత్రకు బలమైన ఆధారాలు వెలుగుచూడలేదు. అయితే క్రీ.శ. 1–3 శతాబ్దాల మధ్య శాతవాహనుల ఆధీనంలో ప్రస్తుత శ్రీకాకుళం జిల్లా ఉందనడానికి కొన్ని ఆధారాలు ఉన్నాయి. క్రీ.శ.340లో సముద్రగుప్తుని దండయాత్ర ఈ ప్రాంతం వరకూ జరిగింది. దీనికి రుజువుగా అలహాబాద్‌లో ఆయన వేసిన ఒక స్తంభ శాసనం కనిపిస్తోంది. ఈ శాసనంలో అతడు జయించిన రాజ్యాల జాబితాలో 'గిరి కొత్తూరు'ను మహేంద్రగిరి ప్రాంతంగా, 'ఎరండపల్లిని ఆమదాలవలస ప్రాంతంగా చరిత్రకారులు నిర్ధారించారు. జయించిన రాజ్యాలను, ఓడిపోయిన రాజులకే ఇచ్చి, సముద్రగుప్తుడు మగధకు వెళ్లిపోయాడు. ఈ పరిణామం వల్ల ప్రస్తుత శ్రీకాకుళం జిల్లాలోని మైదాన ప్రాంతాల రాజులు బలహీనులని తెలుస్తోంది. చిన్న చిన్న రాజుల మధ్య ఐక్యత లేదని కూడా అర్థమవుతోంది. ఈ దుస్థితిని మరోసారి గుర్తుచేశాయి. రెండు వలస రాజవంశాలు, ఒకటి–పిఠాపురం (పిష్టపుర) రాజ్యానికి చెందిన 'మాఠర' వంశం. రెండోది, కర్నాటక నుంచి వచ్చిన గంగ వంశం, మాఠరులు సింహపురాని, గంగులు దంతపురాన్ని ఆక్రమించి రాజ్యాలను అభివృద్ధి చేసుకున్నారు. శ్రీకాకుళానికి దగ్గరలో ఉన్న సింగమే సింహపురం. దంతపురమంటే, సరుబుజ్జిలి – హిరమండలం రోడ్డు పక్కన ప్రస్తుతం కన్పించే దాదాపు 400 ఎకరాల పాటిదిబ్బ.

వజ్రోత్సవ శ్రీకాకుళం

(మొదటిపేజీ తరువాయి)

మసీదుల్లో ఒకటిగా పేర్కొంటారు. రాతి బావులు, మసీదు మెట్ల నిర్మాణం గురించి ప్రత్యేకంగా చెబుతుంటారు. ఇచ్ఛాపురం సమీపంలోని రత్తకన్నవద్ద పీర్లకొండ భిన్నత్వంలో ఏకత్వానికి, మత సామరస్యానికీ ప్రతీకగా నిలుస్తోంది.

సముద్ర యానం ద్వారా ఇండోనేషియా, బర్మా, సింగపూర్, శ్రీలంక తదితర దేశాలతో వాణిజ్యం నెరపిన చరిత్ర ఈ జిల్లా సొంతం. ఆ కాలంలోనే కళింగపట్నం, బారువ ఓడరేవులు విరాజిల్లాయి. వంశధార నది ద్వారా కూడా సరుకు రవాణా జరిగేదని చరిత్రకారులు నిర్ధారించారు. రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం గల జిల్లాల్లో ఒకటి. నాగావళి, వంశధార, బాహుదా వంటి నదులు, వేలాది చెరువులూ సహజ నీటి వనరులు. తూర్పు కనుమల్లో ఎత్తైన ప్రదేశం మహేంద్రగిరి ఈ జిల్లాలోదే. మన ఏజెన్సీ ప్రాంతం విలువైన ఔషధ మొక్కలు, వనమూలికలకు నిలయం. దేశంలోనే పేరెన్నిక గలది పొందూరు సన్న ఖాదీ. కొండ పత్తి పంట, నూలు వడకడం, బట్ట నేయడం వరకు గల ప్రత్యేకత దాన్ని ఆ స్థానంలో నిలిపింది. ఇలా ఎన్నో ఎన్నెన్నో వనరులు, విశిష్టతలు, వైవిధ్యాలు జిల్లాకు ఉన్నాయి.

మహామహులెందరో..

విదేశాల్లో సైతం ఖ్యాతిగాంచిన మల్లయోధుడు కోడి రామ్మూర్తి మన జిల్లావాడు కావడం గర్వకారణం. మాకొద్దీ తెల్లదొరతనమని గర్జించిన జాతీయ కవి గరిమెళ్ల సత్యనారాయణ ఈ గడ్డపై పుట్టి పెరిగిన వారే! తెలుగునాట స్వాతంత్ర్యేచ్ఛను రగుల్కొల్పిన ఆ గేయాన్ని బ్రిటిష్ పాలకులు నిషేధించడమే గాక ఆయన్ను రాజద్రోహ నేరం కింద ఖైదుపాలు చేసిన వైనాన్ని తెలుసుకుంటే సామ్రాజ్యవాద వ్యతిరేకత పెల్లుబికుతుంది. ప్రపంచ ప్రఖ్యాత పాత్రికేయుడు, జర్నలిస్టు ఉద్యమ పితామహుడైన మానుకొండ చలపతిరావు (ఎంసి) సిక్కోలు వాసి. ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య శ్రీకాకుళానికి చెందినవారే. ప్రఖ్యాత ఇంజనీర్ సిఆర్‌ఎం పట్నాయక్‌ను శ్రీకాకుళం కాటన్ అంటారు. జముకుల కథ, తప్పెటగుళ్లు ఈ జిల్లా జానపద కళారూపాలు. సినీ నటులు రావి కొండలరావు, శరత్‌బాబు, జెవి సోమయాజులు, రమణమూర్తి మున్నగువారు, సినీ గాయకుడు జి.ఆనంద్ ఇక్కడి వారే. కథకు గుర్తింపు తెచ్చిన రాచకొండ విశ్వనాథ శాస్త్రి, కథా నిలయం వ్యవస్థాపకులు కాళీపట్నం రామారావు (కారా మాస్టారు) శ్రీకాకుళంవారే కావడం గర్వకారణం.

అయితే, ఇటువంటి ప్రముఖ వ్యక్తులతోపాటు అరేబియా సముద్రంలో చేపల వేటకు వెళ్లి పాకిస్థాన్ జైళ్లలో మగ్గుతున్న మత్స్యకారులు, బంగాళాఖాతంలోని అండమాన్ నికోబార్ ద్వీప వాసులగానూ శ్రీకాకుళం వారున్నారు. కటక్‌లో రిక్షా పుల్లర్లు, సూరత్ జౌళి మిల్లు కార్మికులనేకులు మన జిల్లావారే! పొట్ట చేతపట్టుకొని పని కోసం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకూ వలసలు వెళ్తున్న దుస్థితి ఇంకా కొనసాగుతోంది.

తిరుగుబాటుతనం

తిరుగుబాటుతనం, ఆత్మాభిమానం ఈ ప్రాంత ప్రజల ముఖ్యమైన లక్షణమని పెద్దలంటారు. అది కళింగ యుద్ధం నాటి నుండీ ఉందని ఎవరికైనా బోధపడుతుంది. ఆధునిక కాలంలోనూ ప్రముఖ పోరాటాలు, ప్రత్యేక ఉద్యమాలు, ప్రధాన ఘట్టాలూ చాలా ఉన్నాయి. 1937 జూలై 3 నుండి 1938 మార్చి 25 వరకు ఇచ్ఛాపురం నుంచి మద్రాసుకు సాగిన చారిత్రాత్మక రైతు రక్షణ యాత్రకు ప్రారంభ వేదిక ఈ జిల్లా. రైతు నాయకులు కొమ్మారెడ్డి సత్యనారాయణ, చలసాని వాసుదేవరావు నాయకత్వంలో 1512 మైళ్లు కాలినడకన, 152 మైళ్లు బస్సులో సాగిన చిరస్మరణీయమైన యాత్ర అది. పుల్లెల శ్యామసుందరరావు, గేదెల చంద్రయ్య నాయుడు, మార్పు పద్మనాభం, బెందాళం గవరయ్య, గానుగుల తరుణాచారి, గౌతు లచ్చన్న, దుక్క రాజన్నరెడ్డి, చౌదరి సత్యనారాయణ మున్నగువారు జిల్లాలో నాయకత్వం వహించారు. అటు బ్రిటిష్ వారికీ ఇటు నిత్యం పీడిస్తున్న జమిందార్లకు, ఎస్టేట్లకు వ్యతిరేకంగా జనం ఉద్యమించారు. ఆ పునాది వల్లే 1940 మార్చి 26, 27 తేదీల్లో పలాసలో అఖిల భారత కిసాన్ మహాసభ జరిగింది. ఆ స్ఫూర్తితో మందస జమిందారీ వ్యతిరేక పోరాటం తీవ్రతరం కావడం, సాసుమాను గున్నమ్మ వీర మరణం చెందడం ఉత్తేజపూర్వక చారిత్రక ఘట్టాలు. ప్రజా ఉద్యమాల్లో మహిళలు ముందుపీఠిన వున్నారని తేటతెల్లమవుతుంది.

వాటి కొనసాగింపు గానే జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ పెరిగి పెద్దదైంది. ఇటు సముద్ర తీర ఉద్దానం నుండి అటు గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ వరకు విస్తరించింది. దోపిడీకి వ్యతిరేకంగా రైతులను, కూలీలను, ఆదివాసీలను సమీకరించి, సంఘటితం చేసింది. 1967 అక్టోబర్ 31న మొండెంఖల్లులో జరిగిన జిల్లా గిరిజన మహాసభకు ప్రతినిధులుగా వచ్చిన వారిపై లేవిడి వద్ద కాల్పులు, కోరన్న, మంగన్నల అమరత్వం అనంతరం మరో సంఘర్షణకు గురై మలుపు తిరిగింది. శ్రీకాకుళం రైతాంగ ఉద్యమంగా రూపాంతరం చెందింది. రాజ్యం తీవ్ర నిర్బంధం విధించింది. అనేకమంది మంది మెరికల్లాంటి యువ నాయకులు, కార్యకర్తలను పొట్టనపెట్టుకుంది. వారి త్యాగం అజరామరం. పోలీసులు మాటుగాసి వారిని నిర్బంధించి సమీపంలోని కొండకో అడవికో తీసుకుపోయి కాల్చి చంపి, వాటిని ఎదురుకాల్పులుగా చెప్పిన మోసపూరిత కుట్ర ఆనాడే విస్తృతమైంది. వందలాది గ్రామాలు, గిరిజన గూడేలపై పోలీసు దాడులు, కాన్సెంట్రేషన్ క్యాంపుల్లో వేలాది మందిపై నిర్బంధం.. ఇదంతా 50 ఏళ్ల కిందటి చరిత్ర. ఆనాడు ఉద్యమాన్ని రాజ్యం అణచివేసినా జిల్లా ప్రజల సహజసిద్ధమైన తిరుగుబాటు తత్వం ఎక్కడికీ పోలేదు. ఇటీవలి సోంపేట, కాకరాపల్లి పోరాటాల సందర్భంగా అది వ్యక్తమైంది. అప్పుడూ ఉద్యమం రక్తసిక్తమైనా పాలకుల కుట్రలను జిల్లా ప్రజలు తిప్పికొట్టారు.

పాలకులు జిల్లాను ఇప్పటికైనా అభివృద్ధి బాటలో నడపాలి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయాధారిత పరిశ్రమలను స్థాపించాలి. విద్యా వైద్య సౌకర్యాలు కల్పించాలి. జిల్లాకున్న చారిత్రక, సాంస్కృతిక వైశిష్ట్యాన్ని, వైవిధ్యాన్ని సుసంపన్నం గావించాలి. ఇందుకోసం వివిధ తరగతులు, వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, సంస్థలూ వారెంచుకున్న మార్గాల్లో ప్రభుత్వాలను ప్రభావితం చేయడం అవసరం. ఇదే ఈ వజ్రోత్సవ సందర్భంగా జిల్లావాసులు తీసుకోవాల్సిన వజ్ర సంకల్పం!

సిక్కోలు నుంచి సిడ్నీ వరకు...



కరణం మల్లేశ్వరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సిడ్నీ ఒలంపిక్స్‌లో పతకాన్ని సాధించిన కరణం మల్లీశ్వరితో 'సిక్కోలు' కీర్తిపతాక విశ్వాంతరాల్లో రెప రెపలాడింది. మల్లీశ్వరికి ముందే సిక్కోలు తడాఖాను చాటిచెప్పింది 'కలియుగ భీమ', 'ఇండియన్ హెర్క్యులెస్' 'జగదేక మల్లుడు' అయిన కోడిరామమూర్తి. ఉమ్మడి జిల్లా వీరఘట్టంలో జన్మించి, భారతీయ యోగ 'శాస్త్రంలోని ప్రాణాయామం, జల, వాయుస్థంభన విద్యలను తన శారీరక బల ప్రదర్శనలకు జోడించి 'మల్ల మహామార్తాండ'గా ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతులను చేశారు. మద్రాస్ రాష్ట్రంలోనూ, లండన్ మహానగరంలోనూ జార్జి చక్రవర్తి చేతులమీదుగా 'ఇండియన్ శాండో' బిరుదుతోపాటు బంగారు పతకాల కోటు, నవరత్న ఖచిత స్వర్ణ కంకణం పొంది మన దేశ పౌరుషానికి, సాహసానికి మారుపేరుగా సుమారు మూడు దశాబ్దాలపాటు ప్రపంచ క్రీడారంగ చరిత్రలో నిలిచిన ఏకైక ప్రతినిధి కోడి రామమూర్తినాయుడు మాత్రమే. రోమ్, స్పెయిన్, చైనా, రంగూన్ తదితర దేశాల్లో సన్మానాలు, సత్కారాలతోపాటు ఆ రోజుల్లో వ్యాయామశాస్త్ర ఆచార్య' బిరుదు పొందిన వ్యక్తి, మహాశక్తి నాయుడుగారే. అందుకే ఆ మహనీయుని జ్ఞాపకార్థం శ్రీకాకుళం పట్టణంలో 1983 మార్చి 6న నందమూరి తారక రామారావు చేతులమీదుగా ప్రారంభించిన మల్టీ వర్షన్ స్టేడియానికి కోడిరామమూర్తి స్టేడియంగా నామకరణం చేసి యువతకు అంకితం చేశారు. జిల్లా క్రీడారంగ చరిత్ర గతంలోకి వెళ్తే... జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ 1952లో నాటి కలెక్టర్ ఎన్.భగవాన్‌దాన్ అధ్యక్షునిగా, ప్రముఖ సంఘ సేవకులు బి.ఎస్.శాస్త్రి కార్యదర్శిగా ఆవిర్భవించింది. ఆ రోజుల్లో కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో నిర్వహించే అనేక క్రీడాపోటీలకు జిల్లా జట్లను పంపించి జిల్లాలోని క్రీడాకారుల క్రీడా నైపుణ్యాన్ని, క్రీడాస్ఫూర్తిని ఇనుమడింపజేసి ఘనత జిల్లా ఒలంపిక్ అసోసియేస్‌కు దక్కింది. ఫుట్బాల్, బాస్కెట్బాల్, టెన్నిస్ వంటి క్రీడల్లో జిల్లాకు చెందిన రఘుపతి బ్రదర్స్, అడక్కి బ్రదర్స్, వల్లూరి దర్, రంగారావు, వంటి ఎందరో హేమాహేమీలైన క్రీడాకారులు, రాష్ట్ర, రాష్ట్రేతర పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలను, కప్పులను కైవశం చేసుకుని జిల్లాకు ఎంతో పేరుప్రఖ్యాతులు ఆపాదించి పెట్టారు. కోడి రామమూర్తి స్టేడియంలో తొలి గిరిజన క్రీడా సాంస్కృతిక పోటీలతో క్రీడారంగ చరిత్రకు శ్రీకారం చుట్టింది. కాలక్రమేణా షటిల్ కాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర ఇండోర్ గేమ్స్ కోసం



కోడిరామ్మూర్తి



పూజారి శైలజ

నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని 1985 జనవరి 8న అప్పటి కలెక్టర్ హెచ్.ఎస్.బ్రహ్మ ప్రారంభించారు. శ్యామ సుందరరావు, మహమ్మద్ ఖాసింఖాన్ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పలు పతకాలను సాధించి జిల్లా యువతకు స్ఫూర్తిగా నిలిచారు. అంతర్జాతీయ క్రీడారంగంలో ఆంధ్రకీర్తి పతాకాన్ని ఎగురవేసిన ఘనత జిల్లా వెయిట్ లిఫ్టర్లదే. జిల్లా క్రీడారంగ చరిత్రలో మరిచిపోలేని క్షణాలు 2000 సంవత్సరంలో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో నిర్వహించిన ఒలంపిక్ క్రీడోత్సవాలు. ఆ ఉత్సవాల్లో మన జిల్లాకు చెందిన కరణం మల్లీశ్వరి కాంస్య పతకం సాధించింది. ఇది భారతదేశ ఒలంపిక్ చరిత్రలో ఒక రికార్డు. ప్రప్రథమంగా ఒక భారతీయ మహిళ సాధించిన పతకమే కాక, భారతీయుల పరువు, ప్రతిష్ఠలను నిలిపింది. ఎన్నో అంతర్జాతీయ పతకాలతోపాటు, క్రీడారంగంలో ఎంతో ప్రతిష్టాకరమైన 'రాజీవ్ ఖేల్‌రత్న' 'అర్జున' అవార్డులు కరణం మల్లీశ్వరిని వరించగా, మరో అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారిణి నీలంశెట్టి లక్ష్మి 'అర్జున' అవార్డు సాధించి, జిల్లాకు మరో అవార్డును తెచ్చిపెట్టింది. వీరితోపాటు పూజారి శైలజ, అరుణకుమారి వంటి మహిళా వెయిట్ లిఫ్టర్లు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించి జిల్లా పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపచేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొన్న మొట్టమొదటి వెయిట్‌లిఫ్టర్ నీలంశెట్టి గురివినాయుడు. అదేవిధంగా జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో గేదెల బాలమురళీధర్, కె.వి.కృష్ణయ్య, పి.ధనుంజయరావు, శంకర్ హరిబాబు, కె.దాలినాయుడుతోపాటు ఎంతోమంది వర్థమాను వాలీబాల్ క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత ఉమ్మడి జిల్లా రేగిడి మండలం ఉణుకూరుకు చెందిన వ్యాయామోపాధ్యాయుడు, వాలీబాల్ కోచ్ టి.రామజోగినాయుడుకు దక్కుతుంది. అదేవిధంగా కబడ్డీ, హేండ్బాల్, షటిల్ బ్యాడ్మింటన్ స్విమ్మింగ్, బాడీబిల్డింగ్, కుస్తీ వంటి పోటీల్లో జిల్లాకు చెందిన అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పాల్గొని జిల్లా క్రీడా ప్రాభవాన్ని చాటిచెప్పి, జిల్లా క్రీడారంగం తలమానికంగా నిలిచేలా అహర్నిశలు క్రీడా స్ఫూర్తితో పరిశ్రమించి ప్రగతిపథాన పయనిస్తున్నారు.

చూడచక్కని పర్యాటక 'చిత్రాల' సిక్కోల్...

చిట్టచివరి జిల్లా.. చివరాఖరి జిల్లా... అయితే ఏం పోయింది? పర్యాటక రంగ ఆకర్షణలతో... అందర్నీ ఆకర్షించగల సత్తా గల జిల్లా చిక్కోల్. ఏ మాత్రం కాలుష్య కోరల్లో చిక్కుకొని, సమశీతోష్ణ వాతావరణంతో అన్ని రుతువులూ సమానంగా అనిపించే తత్వం, అనుకూల పర్యావరణ వాతావరణం ఈ చివరి జిల్లా 'సొంతం'. చల్లదనం కోసం ఊటీ, కొడైకెనాల్ లాంటి ప్రాంతాలకు వెళ్తూ ఉంటామని కొందరు చెబుతూంటారు. అయితే పక్కనే ఒక ఊటీ ఉందని తెలియని వారి ఆలోచనలవి! పేదవాని ఊటీగా పేరొందిన శ్రీకాకుళంలో ఎటువైపు చూసినా పర్యాటక ప్రదేశాలే. ఏ ప్రాంతం వెళ్లినా మధురాను భూతులనందించే కట్టడాలే. అసలీ ప్రాంతంలో గల నదీనదులు, సముద్రపు హోయళ్లు, గిరి సీమల గల గలలు, మత్స్యకార జీవన 'విన్యాసాలు', బౌద్ధారామ విరామ, శిల్పకళా చతురత ఇలా ఎన్నో మరెన్నో చెప్పాలంటే చాలా ఉన్నాయి. జిల్లాలో ఒకవైపు శాలిహుండం, మరోవైపు దంతపురి బౌద్ధచరితకు అద్దం పడుతుంటే, మరోవైపు తేలినీలాపురం ఆవాసంగా మా పుట్టిల్లంటూ వచ్చి పిల్లలతో కలసి ఉడాయిస్తూ ఈ ప్రాంత ప్రజల జీవన 'సిత్రం'లో కలసిపోతున్న సైబీరియా పక్షులు, వాళ్ల ఆటపాటలు, మహేంద్రతనయ పర్వతసోయగాలు, శాలిహుండం గోపాలస్వామి, ఖాదీ చేనేతలకు ఖండాంతర ఖ్యాతి తెచ్చిపెట్టిన పొందూరు ఖాదీ, పారిశ్రామిక ఎదుగుదలకు దర్పణంగా నిలిచిన పైడిభీమవరం, ఇవన్నీ జిల్లా ముఖచిత్రంలో ప్రముఖ ప్రాంతాలు కాగా, దశ దిశలా




బారువ బీచ్

సౌరభం వెదజల్లుతూ జిల్లాకే తలమానికమైన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం, పురాణ ప్రసిద్ధి శ్రీకూర్మనాథ ఆలయం, శిల్పకళకు నచిత్ర రూపాన్నిచ్చే శ్రీముఖలింగ ఆలయం - ఇవన్నీ కోల చరితను ఇనుమడింపచేస్తున్న గొప్ప ఆలయాలు. ఇప్పటికీ శ్రీకూర్మనాథ స్వామి ఆలయంలో 11, 19వ శతాబ్ధకాలం నాటి శాసనాలు పరిశోధకులను, చరిత్ర కారులను విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. ఇక్కడ కనిపించే 3డి చిత్రాలు, శిల్పకళా సంపద ఎవర్నైనా కట్టిపడేస్తుందంటే ఏమాత్రం అతిశయోక్తి లేదు.


సర్వమత సమనిత్వాన్ని చాటిచెప్పే ప్రముఖ ఆలయాలు, కళింగపట్నంలోని మదీనా దర్గా, ఇంకా పలు చర్చి నిర్మాణాలు జిల్లాలో అలరారుతున్నాయి. మరో పక్క కళింగపట్నం, మొగదలపాడు, బారువ బీచ్‌లు, బీచ్ టూరిజంలో గల ప్రత్యేక ఆకర్షణలు. నాగావళి, వంశధార, మహేంద్ర తనయల హెరీయళ్లు, గొట్టా బ్యారేజీ, అలనాటి పురాతన నిర్మాణ సామర్థ్యానికి మచ్చుతునకగా నిలిచిన శ్రీకాకుళం పాత బ్రిడ్జి సిక్కోలు అదనపు ఆకర్షణలు.

పర్యాటక సామర్థ్యం

ఇప్పటికే సిక్కోలు పట్టణంలో మూడు స్టార్ హోటళ్ల ప్రారంభమైన నేపథ్యంలో, పర్యాటకులను ఆకర్షించే దిశగా అరసవల్లి, శ్రీకూర్మం, బారువ బీచ్ ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాలు, నిర్మాణాలకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఏది ఏమైనా, గిరిజన టూరిజం, మెడికల్ టూరిజం, బీచ్ టూరిజం, విలేజ్ టూరిజం, వాటర్ టూరిజం అభివృద్ధి చెందడానికి జిల్లాలో అన్ని హంగులూ ఉన్నాయి. ఏ మాత్రం కాలుష్యానికి గురికాని అరుదైన ఆలివ్ రెడ్డి తాబేళ్లు సైతం సంచరించే స్వచ్ఛమైన బీచ్ తీరాలెన్నో ఈ జిల్లాకే సొంతం. ఇటు రణస్థలం నుంచి, అటు వైపు ఇచ్ఛాపురం వరకు విస్తారమైన 193 కిలోమీటర్ల సముద్రతీరం శ్రీకాకుళం జిల్లా స్పెషాలిటీ! విదేశీ వలస పక్షుల విడిదిగా పేరిన్నికగన్న తేలినీలాపురాన్ని ఎవరైనా సందర్శించి తీరాల్సిందే. ఇతర ప్రాంత పర్యాటకులను, విశేషంగా ఆకర్షించే దిశగా, ఇంకా మరిన్ని హోటళ్లు, బీచ్లలో టూరిస్టు హబ్‌ల ఏర్పాటు, చిన్న తరహా కాటేజీలు ప్రారంభించడం, రవాణా సౌకర్యాలు కూడా మరింత మెరుగుపరిస్తే పర్యాటకరంగ ముఖచిత్రంలో సిక్కోల్ జిల్లాకు సరైన స్థానం లభిస్తుందనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.



అరసవల్లి ఆలయం



శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం



కళింగపట్నం లైట్‌హౌస్

కథాతపస్వీ 'కా.రా' మాస్టారు



తన కథలతో తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన కథాతపస్వీ కాళీపట్నం రామారావు (కారా) మాస్టారు. 1924లో పొందూరులో జన్మించిన ఈయన 60కి పైగా కథలు రాశారు. వ్యధార్తుల యథార్థ గాథలతో అక్షర 'యజ్ఞం' చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం సహా అనేక అవార్డులు అందుకున్నారు. కథలకు చిరునామాగా, ఔత్సాహిక రచయితలకు అధ్యయన కేంద్రంగా ఉండేలా శ్రీకాకుళం నగరంలోని 'కథా నిలయం'ను ప్రారంభించారు. 900కు పైగా కథాసంపుటాలు, ఎంతో మంది రచయితలకు ఆ లక్షరధాయం ఓ కల్పవృక్షం. కథలను డిజిటలైజ్ చేసి 2014 నుంచి ఆన్‌లైన్‌లో వాటిని అందుబాటులోకి తెచ్చారు. సాహిత్య సంపదను భావితరాలకు అందించేందుకు విశేష కృషి చేసిన కారా మాస్టారు 2021 జూన్ 4న తుదిశ్వాస విడిచారు.

జాతిరత్నాలు

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ'... అంటే జన్మనిచ్చిన తల్లి, పుట్టిన ఊరు రెండు స్వర్గం కంటే గొప్పవని అర్థం. జీవనానికి నెలవైన...వికాసానికి కొలువైన మాతృభూమిని ఆరాధించడం ప్రతిఒక్కరి కర్తవ్యం. ఆ మాటల్ని పుణికిపుచ్చుకున్న జాతిరత్నాలు ఎందరో సిక్కోలు నేలపై పుట్టి పెరిగారు. కన్న ఊరి ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేశారు. ఆ మహనీయులను సిక్కోలు వజ్రోత్సవాల వేళ ఓ సారి మననం చేసుకుందాం రండి...

– ప్రజాశక్తి, శ్రీకాకుళం

ఇంటింటా శంకరనారాయణ నిఘంటువు



సిక్కోలులో పుట్టి, పెరిగి 158 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన మున్సిపల్ హైస్కూల్లో చదివి, గణిత ఉపాధ్యాయునిగా పనిచేశారు. మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత ఆచార్యునిగా, మద్రాస్ విశ్వవిద్యాలయంలో ప్రధాన పరీక్షల అధికారిగా పనిచేశారు. కొచ్చిన్ యువరాజు, పిఠాపురం రాజా వంటివారు ఈయన శిష్యులు. ఇంగ్లీషు – తెలుగు, తమిళం–ఇంగ్లీష్ డిక్షనరీలు రాసి 1900లో ఎస్.రామానుజం చెట్టియార్ ప్రోత్సాహంతో మద్రాసు నుంచి ప్రచురించారు. నేటికీ శంకరనారాయణ డిక్షనరీ విద్యార్థి లోకానికి ప్రామాణికం.

పాటతో గడగడలాడించిన 'గరిమెళ్ల'



తన గేయాలతో స్వాతంత్ర్యోద్యమాన్ని ముందుకు నడిపించిన గరిమెళ్ల సత్యనారాయణ జన్మస్థలం పోలాకి మండలం ప్రియాగ్రహారం. గాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితుడైన ఈయన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి సాహిత్య బాట పట్టారు. 'మా కొద్దీ తెల్ల దొరతనం...' పాట విని నాటి బ్రిటీష్ కలెక్టర్ బేకన్ ఈయనకు ఏడాది జైలు శిక్ష విధించారు. శిక్షా కాలం పూర్తయ్యాక మళ్లీ పాడినందుకు మరో రెండేళ్ల జైలు జీవితం గడిపారు. ఆ సమయంలోనే ఆయన తండ్రి చనిపోయారు. 'క్షమించమని అడిగితే వదులుతాం' అని తెల్లదొరలు చెబితే అడగని వ్యక్తిత్వం ఆయనది. జైలులో ఉండగానే కన్నడ, తమిళ భాషలు నేర్చుకున్నారు. అనేక పత్రికలకు సంపాదకునిగా పనిచేశారు. 18 పుస్తకాలు అచ్చువేశారు.

పాత్రికేయ వశిష్ఠుడు ఎం.సి



భారతదేశంలో ఎంతోమంది పాత్రికేయులకు ఆదర్శనీయునిగా నిలిచిన మహామనిషి మానికొండ చలపతిరావు. జాతీయ పత్రికారంగంలో ఎం.సి అనే రెండక్షరాలతో ధ్రువతారగా నాలుగు దశాబ్దాలకు పైగా దిశా నిర్దేశం చేశారు. మూడు దశాబ్దాలకు పైగా నెహ్రూ నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంపాదకులు. 1908 మే నెలలో శ్రీకాకుళం పట్టణంలో జన్మించారు. బాల్యమంతా శ్రీకాకుళంలోనే గడిపారు. స్కూల్ ఫైనల్ వరకూ ఇక్కడే చదివి విజయనగరంలో ఇంటర్మీడియేట్, మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో ఇంగ్లీషులో ఎంఎ, ఆ తరువాత న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తిచేశారు. జవహర్లాల్ నెహ్రూ 1938లో నేషనల్ హెరాల్డ్ అనే పత్రికను ప్రారంభించారు. అప్పటికే చలపతిరావు త్రివేణిలో రాసిన వ్యాసాలను చదివిన జవహర్లాల్ నెహ్రూ ఆయనను తన పత్రికలో లీడర్ రైటర్‌గాను, సహాయ కర్త సంపాదకునిగాను నియమించుకున్నారు. ఆ పత్రిక 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ – సమయంలో బ్రిటిష్ వారి నిర్బంధానికి గురై ఆగిపోయింది. 1945లో నేషనల్ హెరాల్డ్ పత్రిక మళ్లీ ప్రారంభమైంది. చలపతిరావు తిరిగి ఆ పత్రికలో చేరారు. 1946లో నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంపాదకుడయ్యారు. అప్పటి నుంచి 32 సంవత్సరాలు ఈ పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. ఇంత సుదీర్ఘకాలం సంపాదకునిగా కొనసాగినవారు పత్రికా సంపాదకునిగా పనిచేస్తూనే హక్కుల కోసం పోరాడారు. భారతీయ వర్కింగ్ జర్నలిస్టు సంఘాన్ని ప్రారంభించారు. ఢిల్లీలో 25 మార్చి 1983వ తేదీన అనూహ్య పరిస్థితుల్లో చలపతిరావు మరణించారు.

కళాఖండాల పాపయ్య




ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య స్వస్థలం శ్రీకాకుళమే. స్వయంకృషితో రంగుల ప్రపంచంలో కుంచెతో ప్రారంభించిన ఈయన ప్రయాణం 1926లో మొదలైంది. 'వ.పా.', 'పావనం' పేర్లతో ఎన్నో కళాఖండాలు తీర్చిదిద్దారు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, చక్రపాణి ప్రోత్సాహంతో చందమామ, యువ పత్రికలతో పాటు, అనేక మాస, వార, దిన పత్రిల్లో చిత్రాలు వేసి ఖ్యాతి పొందారు. పంచతంత్ర కథల్లో జంతువులు, ఊర్మిళ నిద్ర వంటి రూపాలను సహజంగా తీర్చిదిద్దేవారు. దేవీ భాగవతం పూర్తి చేసింది, విష్ణు కథలను రచించింది ఈయనే. 1992 డిసెంబరు 30న మరణించిన వపా శతజయంతి ఉత్సవాలు 2020లో విశాఖపట్నంలో నిర్వహించారు.

జన భాషకు దివిటీ పట్టిన 'గిడుగు'



ఆధునిక తెలుగు సాహిత్యానికి వైతాళికులని చెప్పదగ్గ ముగ్గురిలో.. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావుతో పాటు గిడుగు వెంకట రామ్మూర్తి కూడా ఒకరు. ఆయన తన జీవితకాలంలో అనేక మహోద్యమాలెన్నో చేపట్టారు. వాటిలో కొన్ని ఆయన జీవితకాలంలోనే ఫలితాలివ్వడం మొదలుపెట్టాయి. తెలుగులో వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త. 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాలపేట గ్రామంలో వీర్రాజు, వెంకమ్మ దంపతులకు గిడుగు రామ్మూర్తి జన్మించారు. మహారాజా వారి ఇంగ్లీషు పాఠశాల విజయనగరంలో విద్యాభ్యాసం చేశారు. కలెక్టర్ ఆఫీసులో కొంతకాలం పనిచేసి , పర్లాకిమిడి హైస్కూల్‌లో చేరారు. ముక్కుసూటి వ్యక్తిత్వం వారిది. వ్యవహారిక భాషా వాదాన్ని ప్రారంభించిన గిడుగు వారు గ్రాంథిక భాష ద్వేషి కానే కాదు. ఆయన ప్రాచీన సాహిత్యంలో చదవని గ్రంథం లేదు. తెలియని అర్థం లేదు. పద స్వరూపం లేదు. గ్రాంథిక వాదులందరి కన్నా గొప్ప పాండిత్యం, భాష గల గొప్ప పండితుడాయన.

తెలుగు కథా పికాసో... చాసో



మహాకవి గురజాడ అప్పారావు వారసులలో రెండో తరానికి చెందిన మొదటి రచయిత చాగంటి సోమయాజులు జన్మించింది మన శ్రీకాకుళంలోనే. కాదేదీ కథకనర్హం అన్న రీతిలో ఆంధ్రదేశానికి కొసనున్న కళింగపట్నం నుంచి ఆ కొసనున్న చెన్నపట్నం వరకూ దేనినైనా కథావస్తువుగా స్వీకరించి కథ రాయగల విశిష్ట కథకుడు చాగంటి సోమయాజులు. ఆయన రచనల్లో ఆర్థికాంశాలే ప్రధానమైన కథా వస్తువులు. మానవ జీవితాలపై ఆర్థిక కారణాలు ఎలాంటి గాఢమైన ప్రభావాన్ని చూపిస్తాయో తన రచనలలో అత్యంత ప్రతిభావంతంగా చాసో ప్రతిబింబించారు. సాహితీ ప్రపంచంలో చాసోగా ప్రసిద్ధిపొందిన చాగంటి సోమయాజులు 1915 జనవరి 17న శ్రీకాకుళంలో జన్మించారు. తల్లిదండ్రులు కానుకొలను తులసమ్మ, లక్ష్మీనారాయణ దంపతులు. ఆ తరువాత ఆయన చాగంటి బాపిరాజు దంపతులకు దత్తత వెళ్లారు. జన్మించింది శ్రీకాకుళంలోనైనా ఆయన జీవితం ఎక్కువగా విజయనగరం లోనూ కొనసాగింది.

కన్యాశుల్కం గిరీశంగా...

జె.వి సోమయాజులు సోదరుడు జొన్నలగడ్డ వెంకటరమణమూర్తి 1933లో జన్మించారు. బాల్యం నుంచే నాటకాల్లో నటించడం ప్రారంభించారు. ఆయన ఎన్జీఓ, కప్పలు, ఎవరు దొంగ, కీర్తి శేషులు వంటి నాటకాల్లో నటించారు. గురజాడ 'కన్యాశుల్కం' నాటకంలో గిరీశం పాత్ర పోషించినందుకు ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. 1957లో 'ఎమ్మెల్యే' సినిమాతో సినిమాల్లోకి అడుగుపెట్టాడు. తన కెరీర్‌లో 150కి పైగా చిత్రాల్లో నటించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి 'రావి'



శ్రీకాకుళం సిటీ: నటుడు, దర్శకుడు, రచయిత, పాత్రికేయుడు రావి కొండలరావు ఆరు వందల చిత్రాల్లో నటించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. 1932 ఫిబ్రవరి 11న సామర్లకోటలో జన్మించగా, తండ్రి ఉద్యోగ విరమణ తరువాత శ్రీకాకుళంలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. 2020 జూలై 28న బేగంపేటలో మృతి చెందారు. ఈయన భార్య రాధాకుమారి సైతం నటి. బ్లాక్ అండ్ వైట్ కాలం నుంచి మృతి చెందే వరకూ సినీ పరిశ్రమకు సేవలు అందించారు. 1958లో శోభ చిత్రం ద్వారా నటన ప్రారంభించారు. 2008 కింగ్‌లో అతిథి పాత్రలో నటించారు.

శంకరాభరణం శంకరశాస్త్రిగా...



జొన్నలగడ్డ వెంకట సోమయాజులు '(జె.వి.సోమయాజులు) శంకరాభరణం శంకరశాస్త్రిగా తెలుగు ప్రజలకు సుపరిచితుడైన తెలుగు చలనచిత్ర నటుడు. శ్రీకాకుళం జిల్లా ఉర్లాం వద్ద లుకలాం అగ్రహారంలో 1928లో జన్మించిన సోమయాజులు చదువుకునేటప్పుడే నాటకాలు వేసేవాడు. తన సోదరుడు రమణమూర్తితో కలిసి గురజాడ అప్పారావు ప్రసిద్ధ నాటకం కన్యాశుల్కాన్ని 45 ఏళ్లలో 500 ప్రదర్శనలు ఇచ్చాడు. ముఖ్యంగా కన్యాశుల్కంలో "రామప్పంతులు" పాత్రకు ప్రసిద్ధుడయ్యాడు. సోమయాజులు తల్లి శారదమ్మ అతన్ని ప్రోత్సహించింది. ఆయన 2004లో మృతి చెందారు.

వీనులవిందైన పాటలు ఎన్నో...



సీనియర్ సినీ గాయకుడు కీర్తిశేషులు జి.ఆనంద్ శ్రీకాకుళం జిల్లాలోని తులగాంలో 1944 ఫిబ్రవరి 16న జన్మించారు. ఆయన తండ్రి రంగస్థలంపై అనేక నాటకాలు ప్రదర్శించారు. ఆనంద్ కూడా తన తండ్రి వద్ద సంగీతం నేర్చుకోవడంతో పాటు పలు పౌరాణిక నాటకాల్లో నటించారు. తండ్రి రాముడి పాత్ర పోషించినప్పుడు, ఆనంద్, ఆయన సోదరుడు లవకుశ పాత్రలు పోషించారు. తొలినాళ్లలో తమ ఇరుగు పొరుగు గ్రామాల్లో పండగలు, ఇతర కార్యక్రమాల్లో, సంగీత విభావరుల్లో పాటలు పాడి, పలు బహుమతులు గెలుచుకున్నారు ఆనంద్. మదరాసు (ఇప్పుడు) చెన్నైలో రచయిత దేవులపల్లి కృష్ణ శాస్త్రి, 'నీ గొంతు బావుంది' అంటూ కె.వి.మహదేవన్‌కు ఆనంద్ గురించి సిఫార్సు లేఖ రాశారట కృష్ణశాస్త్రి. ఆ సమయంలోనే 'అమెరికా అమ్మాయి'లో 'ఒక వేణువు వినిపించెను..' పాట పాడే అవకాశం ఆనందకి వచ్చింది. అప్పటి నుంచి పలు చిత్రాల్లో, ప్రైవేట్ ఆల్బమ్స్ 2,500 పైచిలుకు పాటలు పాడిన ఆనంద్ 150 ఆల్బమ్స్ రిలీజ్ చేశారు. టివి సీరియల్స్‌కు, హిందీ నుంచి తెలుగు సహ అనేక అనువాద చిత్రాలకూ స్వరసారథ్యం వహించారు. 'స్వర మాధురి' బృందం ద్వారా ప్రపంచమంతటా సంగీత విభావరులు నిర్వహించారు. ఏకంగా 6,500 పైగా ప్రదర్శనలిచ్చారు. 'స్వరమాధురి' ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది యువ గాయనీ గాయకులను సినీ, దూరదర్శన్ రంగాలకు పరిచయం చేశారు. సుదీర్ఘకాలం చెన్నైలో ఉన్న ఆనంద్ ఆ మధ్య హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ వచ్చారు. వీనులవిందైన పాటలు ఎన్నో పాడిన ఆనంద్ ఆ పాటల ద్వారానే గుర్తుండిపోతారు.

విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య ఉద్యమంలోకి...


చౌదరి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చౌదరి సత్యనారాయణ విద్యార్థి దశలోనే స్వాతంత్రోద్యమ పిలుపునందుకుని ఉద్యమబాట పట్టారు. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం పురంలో 1908, జులై 13వ తేదీన చౌదరి పురుషోత్తంనాయుడు, నారాయణమ్మకు ఆయన జన్మించారు. 1921లో స్వాతంత్ర్య పోరాటంలో విద్యార్థులు పాల్గొనాలని జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు తరగతుల బహిష్కరణకు చౌదరి సత్యనారాయణ నాయకత్వం వహించారు. విద్యార్థి దశలోనే బ్రిటీష్ పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నారు. 1921లో బరంపురంలో నిర్వహించిన కాంగ్రెస్ సభకు గౌతు లచ్చన్నతో కలిసి హాజరయ్యారు. 1922లో కల్లు వ్యాపారాన్ని వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్వహించిన ఉద్యమంలో పాల్గొన్నారు. 1923లో కళింగపట్నంలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో తన సహచరులతో కలిసి పాల్గొన్నారు. 1926లో గాంధీజీ ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వరకు నిర్వహించిన యాత్రలో బొంతలకోడూరు, తిలారు, సారవకోట తదితర ప్రాంతాల్లో పుల్లెల శ్యామసుందరరావు, గౌతు లచ్చన్నతో కలిసి తిరిగారు.

రెండుసార్లు ఎమ్మెల్యేగా...

స్వాతంత్ర్యానంతరం 1955లో షేర్‌మహమ్మద్‌పురం నుంచి కృషికార్ పార్టీ తరుపున శాసనసభకు ఎన్నికయ్యారు. 1962లో స్వతంత్ర పార్టీలో చేరిన ఆయన 1967లో విశాఖ ఉక్కు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1976లో పొందూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర పార్టీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 12 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా వ్యవహరించిన ఆయన, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నుంచి తామర పత్రం పొందారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా, ఎమ్మెల్యేగా రెండుసార్లు ఎన్నికైనా ఆయన నిరాడంబరంగానే జీవితాన్ని గడిపారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎవరు తనతో ఉన్నా, సైకిల్ పైనే సంబంధిత కార్యాలయానికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ఉక్కు మనిషి... పుల్లెల శ్యాంసుందరరావు



ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

స్వాతంత్ర్యం కోసం తన యావదాస్తిని వదులుకుని, బ్రిటీష్ దొరలతో ఉక్కు మనిషి అనిపించకున్నారు పుల్లెల శ్యాంసుందరరావు. 1903, డిసెంబరు 23న ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన పుల్లెల వెంకటరామయ్య, కామేశ్వరమ్మల ద్వితీయ సంతానంగా శ్యాంసుందరరావు జన్మించారు. జమీందార్ కుటుంబానికి చెందిన ఆయన గాంధీజీ పిలుపునందుకుని స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. పిన్న వయసులోనే శ్రీకాకుళం జిల్లా నుంచి ఉమ్మడి మద్రాసు వరకు ఉద్యమాన్ని వ్యాపింపజేసిన మహనీయుడు పుల్లెల శ్యాంసుందరరావు. ఎన్నోసార్లు జైలుకు వెళ్లినా.. పోరాటంలో వెనకడుగు వేయలేదు. చివరకు బ్రిటీష్ దొరలు వారి ఇంటిలోనే బంధించగా 37 ఏళ్ల వయసులోనే ఆయన కన్నుమూశారు. పుల్లెల శ్యాంసుందరరావు స్వాతంత్ర్య సమరయోధుడే కాదు మంచి రచయిత, పాత్రికేయుడు కూడా. ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు ప్రజావాణి అనే పత్రికను నడిపారు. 1933లో ఇచ్ఛాపురం పంచాయతీ ద్వితీయ ప్రెసిడెంట్‌గా, 1937లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం శాసనసభ్యుడిగా సేవలందించారు. 1940లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకును స్థాపించి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉంటూ రైతులకు ఎనలేని సేవలందించారు. ఆ మహనీయుడి గుర్తుగా ప్రస్తుతం పురపాలక సంఘం భవనానికి శ్యాంసుందర భవన్‌గా నామకరణం చేశారు. అంతేగాకుండా ఆయన చిత్రపటాన్ని కార్యాలయంలోనే ఉంచారు. పంజావీధిలో ఉన్న మున్సిపల్ స్కూల్ ఆవరణలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. 1972, ఆగస్టు 15 నుంచి 1973 ఆగస్టు 14 వరకు భారత సంవిధానాన్ని ఆ శిలాఫలకం మీద పొందుపరిచారు.

స్వాతంత్ర్య సమరంలో 'సర్దార్'



స్వాతంత్రోద్యమంలో గౌతు లచ్చన్నది విశిష్టమైన స్థానం. అందుకే ఆయన సర్దార్‌గా పేరుగాంచారు. గౌతు లచ్చన్న సోంపేట మండలం బారువలో 1909 ఆగస్టు 16న జన్మించారు. గౌతు లచ్చన్నపై బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు ప్రభావం తీవ్రంగా పడింది. 1930లో ఉప్పు సత్యాగ్రహం చేసి గాంధేయవాదిగా మద్యపాన నిషేధాన్ని ప్రచారం చేస్తూ.. ఊరూరా తిరిగారు. గాంధీజీ సత్యాగ్రహాన్ని, దండయాత్రను ప్రారంభించగా, బారువలో కాంగ్రెస్ కమిటీ ఉప్పు సత్యాగ్రహ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు గౌతు లచ్చన్నను నరసన్నపేట జైలులో 40 రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల పాటు బరంపురం జైలులో శిక్ష అనుభవించారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమానికి మహాత్మా గాంధీ నుంచి లచ్చన్నకు పిలుపు అందింది. అనంతరం ఆయనకు రాజమండ్రి జైలులో ఐదు మాసాల శిక్ష పడడంతో అక్కడే జొన్నలగడ్డ రామలింగయ్యతో పరిచయం ఏర్పడింది. జైలులో లచ్చన్న నిరాహారదీక్ష చేశారు. 1932లో హరిజనోద్యమానికి మద్దతుగా హరిజన రక్షణ యాత్రను నిర్వహించారు. ఆచార్య ఎన్‌జి రంగాతో కలిసి కృషికార్ లోక్‌పార్టీ స్థాపించారు.

'వీర'నారి గున్నమ్మ



పీడనకు, దోపిడీకి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా శ్రీకాకుళం జిల్లాలోని మందస జమీ రైతులు 82 ఏళ్ల క్రితం తిరగబడ్డారు. భూమి సాగు చేసినందుకు శిస్తు, అడవిలోకి వెళ్తే పుల్లరిని వసూలు చేసే జమిందారుల తీరును ప్రశ్నించారు. 'అడవి మీ అబ్బదా? రాజుగారు ఏమైనా మొక్కలు నాటాడా? నీరు పోసి అడవిని పెంచారా?' అంటూ అధికారులను ఎదుర్కొన్నారు. అక్రమ వసూళ్లపై విసుగెత్తిన ప్రజలు తిరుగుబాటు చేసి కలప తెచ్చుకున్నారు. 1940 మార్చి 30న తాలూకా మెజిస్ట్రేట్, ఎస్ఐ, బ్రిటీష్ పోలీసులతో కలిసి జిఆర్‌పురం వచ్చారు. తనిఖీలు నిర్వహించి ఏడుగురుపై కేసు నమోదుచేశారు. ఏప్రిల్ ఒకటిన సబ్ కలెక్టర్, పోలీసులు ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చారు. కేసు నమోదైన వారిని జైలుకు తరలించే ఏర్పాట్లు చేశారు. దీంతో రైతులంతా ఎదురుతిరిగారు. ఆ తర్వాత రైతు సంఘం నాయకులు మార్పు పద్మనాభం, జగన్నాథం, మహంతి నారాయణలను అరెస్టు చేయడంతో రైతులు, బ్రిటీష్ పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. రైతులకు నాయకత్వం వహించిన సాసుమాను గున్నమ్మ తెగువను చూసి భీతిల్లిపోయిన పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో పోలీసులను తీవ్రంగా ప్రతిఘటించి పోరాడిన 26 ఏళ్ల సాసుమాను గున్నమ్మ పోలీసుల తూటాకు బలై అక్కడికక్కడే ఆసువులు బాసింది. ఈ కాల్పుల్లోనే గున్నమ్మతో పాటు రైతులు గొర్లె జగ్గయ్య, కర్రి కలియాడు, గుంట చిననారాయణ, గుంట చక్రపాణి వీర మరణం పొందగా... కానిస్టేబుల్ దొడ్డాల రంగారావు కూడా మృతి చెందాడు. వీరితోపాటు మరికొందరు తీవ్ర గాయాలుపాలై ధీరత్వాన్ని చూపారు. ఈ తిరుగుబాటు వెనక తరతరాల అణచివేతపై రగిలిన ఆగ్రహం ఉంది. ఈ పోరాట స్ఫూర్తి ... నాటి శ్రీకాకుళం గిరిజన రైతాంగం పోరాటం కొనసాగుతూనే ఉంది.

మత సామరస్యం సిక్కోలు సంస్కృతిలో ఓ భాగం



ప్రజాశక్తి - శ్రీకాకుళం

మత సామరస్యం ఉత్తరాంధ్ర సంస్కృతిలో ఒక భాగమని చరిత్ర చెబుతోంది. శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువగా మతసామరస్యం గ్రామీణ స్థాయిలోనూ వెల్లివిరియడం ఒక ప్రత్యేకత. ప్రాచీన కాలంలో వైదిక, జైన, బౌద్ధ, హిందూ మతాల మధ్య ఆధిపత్య పోరు జరిగిందనడానికి ఆధారాలున్నాయి. కానీ అనుభవాలు నేర్పిన - పాఠమో, ఇతర మతాలవారు మనలాంటి మనుషులేనన్న సంస్కారమో? కారణాలు ఏమైనా సమభావనం, సహజీవనం శ్రీకాకుళం జన జీవిత ఔన్నత్యాన్ని చెబుతున్నాయి. అయిదు వందల ఏళ్ల క్రితం గోల్కొండ నవాబుల పాలనతో ఈ ప్రాంతానికి మహమ్మదీయ మతం కూడా పరిచయమైంది. 'చికాకోల్' పేరుతో ప్రస్తుత శ్రీకాకుళం కేంద్రంగా నవాబులే ఒక పరగణాను ఏర్పాటుచేశారు. షేర్ మహ్మద్ ఖాన్ తొలి ఫౌజ్దార్‌గా వచ్చిన తరువాత శ్రీకాకుళం జామియా మసీదు నిర్మించారు. ఇదే జిల్లాలోకల్లా పెద్ద మసీదు. రోజుకో మసీదు లేదా దర్గాకు వెళ్లి నమాజ్ చేయడానికి మరో 344 నిర్మించాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున నిర్మాణాలు జరిగాయి. మత ప్రచారానికి ముస్లిం సాధువుల (సూఫీలు) సమాధులపై కళింగపట్నం, ఇచ్ఛాపురాల్లో దర్గాలు నిర్మించారు. ప్రస్తుత 90 శాతం మసీదులు శిథిలం కావడమో, కాల గర్భంలో కలసిపోవడమో జరిగిపోయాయి. జిల్లాలో చాలా గ్రామాల పేర్లు మహమ్మదీయులకు సంబంధించినవే. మహ్మదీయులు ఇతర మతాలతో కలసి, మెలసివుంటూ 'వరుస'లతో పిలుచుకోవడం విశేషం. ఇచ్ఛాపురం, కళింగపట్నం దర్గాలకు అన్ని మతాల వారూ వెళ్లి 'తాయెత్తు'లు కట్టించు కుంటారు. కళింగపట్నం దర్గాలో కొబ్బరి కాయలు కొట్టడం, వాటి ముక్కలను అటుకులు, పంచదారతో కలిపి ప్రసాదంగా ఇవ్వటం విశేషం. దాదాపు ఐదు వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఈ దర్గాకు హిందువులే అధిక సంఖ్యలో వచ్చి తాయెత్తులు కట్టించుకుంటారు. పీర్ల పండగల్లో సందడంతా ఇతర మతాల వారిదే.

అలాగే మూడువందల ఏళ్ల క్రితం ఇంగ్లండ్ నుంచి వచ్చిన మిషనరీలతో క్రైస్తవం పరిచయమయింది. పాతపట్నం ప్రాంతంలోని తెంబూరులో జన్మించిన పురుషోత్తమ చౌదరి క్రైస్తవమతంలో చేరి పాటలతో, పద్యాలతో తెలుగు క్రైస్తవ పద కవితా పితామహునిగా చరిత్రకెక్కారు. ఆయన పాట వినిపించని క్రైస్తవుని ఇల్లు నేటికీ లేదంటే ఆశ్చర్యం కాదు. ఆయన కూడా శ్రీకాకుళం గర్వించదగిన క్రైస్తవ వాగ్గేయకారుడు. శ్రీకాకుళం చిన్నబజార్ రోడ్‌లో తెలుగు బాప్టిస్ట్ చర్చిని 160 ఏళ్ల క్రితం నిర్మించింది ఆయనే. క్రిస్మస్ సంబరాల్లో అన్ని మతాలవారూ పాల్గొని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. పిల్లలకు పుట్టుకొప్పు తీయించడం, కొబ్బరికాయలు కొట్టడం, పెళ్ళిళ్లలో మంగళ సూత్రాలు ముడివేయడం వంటి హిందూ ఆచారాలు క్రైస్తవుల్లోనూ కనిపించడం, హిందూ సమాజంతో వారి జీవన విధానాలు ముడి పడటం, వ్యక్తిగత జీవన విధానాలు సైతం మతసామరస్యానికి మరింత బలాన్నివ్వడం ఆనందిచదగిన అంశం.

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు ఖాదీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

దేశ వారసత్వ సంపదలో భాగంగా ప్రంచంలోనే పొందూరు ఖద్దరు వస్త్రాలు ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్వతంత్రోద్యమ కాలంలో ఈ ప్రాంతాన్ని సందర్శించే సమయంలో బాపూజీ ప్రశంసలే ఇక్కడి కళారూపానికి ప్రస్థానమైంది. ఖాదీ కళాకారుల నైపుణ్యమే సంస్థ అభివృద్ధికి దోహదపడుతుంది. జాతిపిత మహాత్మా గాంధీ మొదలుకొని అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో పాటు ఎంతో మంది విదేశీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రముఖ సినీనటులనే కాకుండా యువతను సైతం ఈ ఖాదీ వస్త్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతీయ ఖాదీ విఫణిలో పొందూరు ఖద్దరుకు అగ్రస్థానం. ప్రాశ్చాత్య పోకడలతో సాగుతున్న ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పోటీతత్వాన్ని తట్టుకుంటూ ఖద్దరు వస్త్రం నిలదొక్కుకుందంటే ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యమే కారణమని చెప్పవచ్చు. ఆధునిక సాంప్రదాయాలు, మారుతున్న అభిరుచులతో పొందూరు ఖద్దరు ప్రపంచ నలుమూలలా విస్తరించిందంటే ఖాదీ కార్మికుల కష్టార్జితమేనని చెప్పవచ్చు. పొందూరు ఖద్దరు అంటే మక్కువ చూపని వారుండరు. సుమారు ఏడు దశాబ్దాల క్రితం కుటీర పరిశ్రమగా మొదలై అందుబాటులో ఉన్న పరికరాలను వినియోగించుకుంటూ ఎన్నో కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తూ పొందూరుకు కీర్తి ప్రతిష్ఠలను తీసుకువస్తూ అగ్రస్థానంలో నిలిపింది.



వస్త్రాలు నేస్తున్న కార్మికులు



శ్రీకాకుళం జానపదాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'జనం పదాలుగా పాడుకునే పదాలే జానపదాలు'. అసలు సిసలైన తెలుగు జీవితం పల్లెల్లో ఉంటుంది. గ్రామీణ జీవితాలతో జానపద కళాకారులు వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగి స్తుంటారు. జాతరలు, అమ్మవారి కొలువులు, తిరునాళ్లు, నవరాత్రుల్లో ఈ జానపదాలు సంతరించుకుంటాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకమైన కళారూపం ప్రచారంలో వుంది.

మన శ్రీకాకుళం జానపదంలో తప్పెటగుళ్లు, డప్పు వాయిద్యం, రుంజా వాయిద్యం, చెక్కభజన, పండర భజన, కోలాటం, పందిరిపాట, ఎరుకుల పాట, జముకుల పాట, తూర్పు భాగవతం, శివభాగవతం, రామదాసు కీర్తనలు, దాసరి పాటలు, శకుని పక్షి, ఎరుక చెప్పుట, తోలుబొమ్మలాట, గిరిజన నృత్యం, చెంచుభాగవతం, కోయ నృత్యం, మరాఠీ నృత్యం, పులివేషం, పగటి వేషధారణ, మరగాళ్ల నృత్యం, ఆటగాళ్లు, చిందుల నృత్యం, కుప్పిగెంతులు, బుర్రకథ, ఉరుపు పాటలు, పల్లెసుద్దులు, పిట్టలదొర, వీరముష్టివారు, సోధి చెప్పుట, దాసర్లు, గంగిరెద్దు ఇలా...





విశ్వ విపణిలో 'సిక్కోలు ఖనిజాలు'

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రపంచ గ్రాస్టేట్ మార్కెట్‌లో 'శ్రీకాకుళం బ్లూ' పేరుతో ఈ జిల్లాలో మాత్రమే లభించే గ్రానైట్ రకానికి విశేష ఆదరణవుంది. నిజానికి 1992 వరకూ ఇక్కడ గ్రానైట్ తవ్వకాలు జరగలేదంటే ప్రపంచ కిట్ల దోపిడీదారుడిగా చరిత్రకెక్కిన 'తెల్లదొర' కూడా సిక్కోలు ఖనిజ 50 సంపదను పసిగట్టలేకపోయాడన్నమాట! ఈ ప్రాంతంలోని కొండలు, భూగర్భంలోని రాతిపొరలను ఖనిజ శాస్త్రవేత్తలను ఖోండలైట్, చారోలైట్, గ్రానైట్, గ్రాన్యులైట్, లెప్టిలైట్, కేల్క్-గ్రాన్యులైట్ చెత్త శిలలుగా ఏనాడో గుర్తించారు. అవిభక్త శ్రీకాకుళం జిల్లాలోని ఇది గరివిడి - గర్భం ప్రాంతాల్లో మాంగనీసు, పొందూరు వరకు క్వార్ట్జ్ గనులను కనుగొన్న తరువాత కొన్ని పరిశ్రమలు వచ్చాయి. గ్రానైట్‌ను మొట్ట మొదట 'డెకోరేటివ్ రాయి'గా విశాఖలో గుర్తించారు. దానికి వైజాగ్ బ్లూ, సిల్వర్, లైట్ అని పేరుపెట్టి ప్రపంచ మార్కెట్‌ను పరిచయం చేశారు. కానీ నాణ్యత, రాతి పరిమాణం నచ్చక, జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ అభివృద్ధి కాలేదు. 1992లో 'శ్రీకాకుళం' వెలుగుచూసింది. కేవలం, గడిచిన ఇరవై ఏళ్లలోనే 2,698 దరఖాస్తులు తవ్వకాలకు వచ్చాయంటే ఈ జిల్లా 'నీలంరాతి'కి ఎంత డిమాండుందో తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం, శ్రీకాకుళం పరిధిలో 643 దరఖాస్తులు, టెక్కలి పరిధిలో 169 దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం 238 క్వారీల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. 1992-93లో 59 క్వారీల వల్ల రూ.కోటి 17 లక్షల ఆదాయం ప్రభుత్వానికి లభిస్తే, 93-94లో అత్యధికంగా 153 క్వారీల్లో తవ్వకాలు జరిగాయి. రూ.2.26 కోట్ల ఆదాయం లభించింది. 2002-03లో 59 క్వారీల్లోనే తవ్వకాలు జరిగినా, అత్యధికంగా రూ.7.67 కోట్ల ఆదాయం లభించింది. 2003-04 వరకూ మొత్తం రూ.44.64 కోట్ల ఆదాయం సమకూరింది. గ్రానైట్ పరిశ్రమ వల్ల వందలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. తమిళనాడు సంస్థలు తొలిరోజుల్లో ఇక్కడి గ్రానైట్ గుర్తించి, వ్యాపారాలు ప్రారంభించాయి. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన సంస్థలే ఎక్కువగా వ్యాపారాలు చేస్తున్నాయి. 'శ్రీకాకుళం బ్లూ'కు అంతర్జాతీయంగా డిమాండ్ లభించడంతో విశాఖ, కాకినాడ ఓడరేవుల నుంచి విదేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. సముద్ర తీరంలో ఇలిమినైట్, జిర్కాన్, గార్నెట్, సిలిమనైట్, రుటైల్ వంటి అరుదైన, విలువైన ఖనిజ నిక్షేపాలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిని వెలికితీసే కాంట్రాక్టులు దక్కించుకున్న సంస్థలు వందల కోట్ల రూపాయిల పెట్టుబడితో పరిశ్రమలను నెలకొల్పాయి. ఇవి కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. సముద్రతీర ఖనిజాలకు కూడా అంతర్జాతీయ డిమాండ్ వుంది. గ్రానైట్, తీర ఖనిజాల వల్ల ప్రపంచ ఖనిజ ముఖచిత్రంలో శ్రీకాకుళానికి కూడా సముచిత స్థానం లభించడం గర్వకారణం.

1953 - 2024 లోక్‌సభ సభ్యుల వివరాలు

క్ర.సం	నియోజకవర్గం	గెలుపొందిన అభ్యర్థి పేరు	రాజకీయ పార్టీ
		1952 లోక్‌సభ	
1	పాతపట్నం	వి.వి.గిరి	కాంగ్రెస్
2	శ్రీకాకుళం	బొడ్డేపల్లి రాజగోపాలరావు	ఇండిపెండెంట్
3	పార్వతీపురం	ఎన్.రామశేషయ్య	ఇండిపెండెంట్
		1957 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	బి.రాజగోపాలరావు	కాంగ్రెస్
2	పార్వతీపురం	బి.సత్యనారాయణ	కాంగ్రెస్
		డి.సూరిదొర(ఎస్.టి)	ఇండిపెండెంట్
		1962 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	బి.రాజగోపాలరావు	కాంగ్రెస్
2	పార్వతీపురం	బి.సత్యనారాయణ	కాంగ్రెస్
3	చీపురుపల్లి	రావు వెంకటగోపాలకృష్ణ రంగారావు	కాంగ్రెస్
		1967 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	గౌతు లచ్చన్న	స్వతంత్ర
		ఎన్.జి.రంగా	స్వతంత్ర
2	పార్వతీపురం	టి.నరసింహారావు	స్వతంత్ర
3	బొబ్బిలి	కర్రి నారాయణరావు	కాంగ్రెస్
		1971 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	బి.రాజగోపాలరావు	కాంగ్రెస్
2	పార్వతీపురం(ఎస్.టి)	బిడ్డిక సత్యనారాయణ	కాంగ్రెస్(జె)
		1977 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	బి.రాజగోపాలరావు	కాంగ్రెస్
2	పార్వతీపురం(ఎస్‌టి)	వైరిచర్ల కిశోర్‌చంద్ర దేవ్	కాంగ్రెస్
		1980 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	బి.రాజగోపాలరావు	కాంగ్రెస్-ఐ
2.	పార్వతీపురంవైరిచర్ల	కిశోర్‌చంద్ర దేవ్	కాంగ్రెస్(ఎస్)
		1984 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	హనుమంతు అప్పయ్యదొర	టిడిపి
2.	పార్వతీపురం(ఎస్.టి)	వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్	కాంగ్రెస్(ఎస్)
		1989 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కె.విశ్వనాథం	కాంగ్రెస్
2.	పార్వతీపురం(ఎస్.టి)	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్
		1991 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కె.విశ్వనాథం	కాంగ్రెస్
2.	పార్వతీపురం(ఎస్.టి)	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్
		1996 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కె.ఎర్రన్నాయుడు	టిడిపి
2.	పార్వతీపురం(ఎస్.టి)	వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్	కాంగ్రెస్
3.	బొబ్బిలి	కె.పైడితల్లి నాయుడు	టిడిపి
		1999 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కె.ఎర్రన్నాయుడు	టిడిపి
2.	పార్వతీపురం(ఎస్.టి)	శత్రుచర్ల విజయరామరాజు	కాంగ్రెస్
3.	బొబ్బిలి	కె.పైడితల్లి నాయుడు	టిడిపి
		1999 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కె.ఎర్రన్నాయుడు	టిడిపి
2.	పార్వతీపురం	డి.వి.జి.శంకరరావు	టిడిపి
3.	బొబ్బిలి	బొత్స సత్యనారాయణ	కాంగ్రెస్
		2004 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కె.ఎర్రన్నాయుడు	టిడిపి
2.	పార్వతీపురం	కిశోర్ చంద్రదేవ్	కాంగ్రెస్
3.	బొబ్బిలి	బొత్స ఝాన్సీలక్ష్మి	కాంగ్రెస్
		2009 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కిల్లి కృపారాణి	కాంగ్రెస్
2.	విజయనగరం	బొత్స ఝాన్సీలక్ష్మి	కాంగ్రెస్
3.	అరకు	కిశోర్ చంద్రదేవ్	కాంగ్రెస్
		2014 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కింజరాపు రామ్మోహన్‌నాయుడు	టిడిపి
2.	విజయనగరం	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
3.	అరకు	మీసాల గీత	వైసిపి
		2019 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కింజరాపు రామ్మోహన్‌నాయుడు	టిడిపి
2.	విజయనగరం	బెల్లాన చంద్రశేఖర్	వైసిపి
3.	అరకు	జి.మాధవి	వైసిపి
		2024 లోక్‌సభ	
1	శ్రీకాకుళం	కింజరాపు రామ్మోహన్‌నాయుడు	టిడిపి
2.	విజయనగరం	కలిశెట్టి అప్పలనాయుడు	టిడిపి

శాసనసభ స్పీకర్లు

1.రొక్కం లక్ష్మీనరసింహం దొర
2.తంగి సత్యనారాయణ
3.కావలి ప్రతిభా భారతి
4.తమ్మినేని సీతారాం

కేంద్ర మంత్రులు

1.కింజరాపు ఎర్రన్నాయుడు
2.కిల్లి కృపారాణి
3.కింజరాపు రామ్మోహన్ నాయుడు

రాష్ట్ర మంత్రులు

1.గౌతు లచ్చన్న
2.లుకలాపు లక్ష్మణదాస్
3.గొర్లె శ్రీరాములు నాయుడు
4.ధర్మాన ప్రసాదరావు
5.కావలి ప్రతిభాభారతి
6.కిమిడి కళా వెంకటరావు
7.గుండ అప్పలసూర్యనారాయణ
8.గౌతు శ్యామసుందర శివాజీ
9.కిమిడి మృణాళిని
10.తమ్మినేని సీతారాం
11.ధర్మాన కృష్ణదాస్
12.సీదిరి అప్పలరాజు
13.కింజరాపు అచ్చెన్నాయుడు

ఎప్పుడు.. ఏం జరిగిందంటే..

1902
ఒడిశాలోని గంజాం జిల్లాలో రాయగడ, ఛత్రపూర్‌లతో కలిసి రెవెన్యూ డివిజన్‌గా అవతరణ.

02.04.1936
ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు

15.08.1950
11 తాలుకాలు, 3 రెవెన్యూ డివిజన్లు, 18 శాసనసభ స్థానాలతో నూతన జిల్లాగా ఆవిర్భావం.

01.10.1953
ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి వేరుపడి ఆంధ్రాలో ఒక జిల్లాగా గుర్తింపు.

1954
పంచాయతీ సమితుల ఏర్పాటు (తొలుత 24, తరువాత 16కు కుదింపు).

23.01.1960
కొలువుదీరిన జిల్లా అధికారిక బోర్డు (దీనినే నేడు జిల్లా పరిషత్‌గా పిలుస్తున్నారు).

1969
తొలిసారిగా జిల్లా విభజన. సాలూరు, బొబ్బిలి తాలుకాల్లోని 107 గ్రామాలతో కొత్తగా గజపతినగరం తాలుకాగా ఏర్పాటు.

01.06.1979
సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం తాలుకాలు జిల్లా నుంచి వేరుపడి విజయనగరం జిల్లాలో చేరిక.

25.05.1985
సమితుల స్థానంలో మండలాలు వచ్చాక 37 మండలాలుగా కూర్పు.

31.01.1951
జిల్లా బోర్డు ఏర్పాటు

01.11.1956
ఆంధ్రప్రదేశ్‌లో ఒక జిల్లాగా అవతరణ

04.04.2022
మరోసారి జిల్లా పునర్విభజన. రెండు శాసనసభ స్థానాలు (పాలకొండ, రాజాం), 8 మండలాలు జిల్లా నుంచి వేరుపడి పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో చేరిక.

శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ల వివరాలు

1	షేక్ అహ్మద్	15.8.1950	30.6.51
2	భగవాన్ దాస్	1.7.1951 - 1.7.52	16.12.1954 - 15.3.55
3	జె.పి.ఎల్. గ్విన్	2.7.1952	13.6.53
4	ఎమ్.పి కరియప్ప	14.6.1953	15.12.54
5	పి.సి జేమ్స్	20.3.195	9.5.56
6	టి.సత్యనారాయణరావు	10.5.1956	5.8.56
7	వి.సుందరేశన్	6.8.1956	17.4.58
8	హసీం అలీఖాన్	17.4.1958	26.11.59
9	సయ్యద్ హసన్ అలీఖాన్	3.4.1959	14.5.59
10	మహ్మద్ మొహిఉల్లా	26.11.1959	13.1.60
11	వి.బి రామారావు	22.21960	15.2.61
12	బి.హెచ్ అన్సారీ	16.2.1961	15.10.62
13	వి.నారాయణరావు	15.10.1962	22.12.62
14	సయ్యద్ నూరల్ హసన్ జాఫ్రీ	22.12.1962	16.6.63
15	ఎస్.కె.మురళీధరరావు	16.6.1963	21.12.64
16	పి.శంకర్ గురుస్వామి	17.3.1965	17.5.66
17	ఎస్.రాఘవ	13.6.1966	7.1.67
18	ఎస్.సంతానం	7.1.1967	22.12.67
19	కె.చక్రవర్తి	7.2.1968	11.11.68
20	బి.ఆర్.కె శాస్త్రి	22.1.1968	8.6.69
21	బి.ఎన్.యుగంధర్	9.6.1969	3.5.71
22	కె.పురుషోత్తంనాయుడు	4.7.1971	1.11.75
23	టి.మునివెంకటప్ప	10.1.1974	27.8.76
24	వి.ఆనందరావు	28.8.1976	11.10.76
25.	ఎస్.కె.పచోరి	12.10.1976	28.6.78
26	బి.దానం	10.7.1978	1.5.80
27	జె.ఎమ్.గిర్‌గ్లాని	1.5.1980	2.6.82
28	జె.హరినారాయణ	2.3.1982	10.9.83
29	హెచ్.ఎస్.బ్రహ్మ	22.9.1983	24.4.87
30	ఎస్.చల్లప్ప	24.4.1983	30.4.88
31	అసుతోష్ మిశ్రా	24.5.1988	21.1.90
32	ఎన్.రమేష్‌కుమార్	27.1.1990	31.10.90
33	ఎస్.పి.సింగ్	1.11.1990	8.1.93
34	అనిల్ చంద్ర పునేఠా	9.1.1993	10.9.96
35	ఆర్.పి.సిసోడియా	10.9.1996	6.12.96
36	వి.ఎమ్.మనోహర్‌ప్రసాద్	7.12.1996	22.4.99
37	ఎస్.ఇ.శేఖర్‌బాబు	22.4.1998	8.4.99
38	ఎమ్.వి. సత్యనారాయణ	9.4.1999	10.4.99
39	కె.ఎస్.జవహర్‌రెడ్డి	11.4.1999	26.6.2002
40	కె.విజయానంద్	15.7.02	19.4.04
41	ఎస్.నాగేశ్వరరావు	19.6.04	22.6.05
42	ఎ.కోటేశ్వరరావు	22.6.05	22.5.06
43	వి.ఎన్.విష్ణు	22.5.06	2.3.08
44	ఎన్.శ్రీకాంత్	2.3.08	25.5.11
45	జి.వెంకటరామరెడ్డి	27.5.11	2.7.12
46	సౌరభ్‌గౌర్	3.7.12	13.7.14
47	గౌరవ్ ఉప్పల్	14.7.14	5.1.15
48	పి.లక్ష్మీనరసింహం	12.1.15	20.4.17
49	కె.ధనంజయరెడ్డి	21.4.17	9.2.19
50	ఎం.రామారావు	9.2.19	23.2.19
51	జె.నివాస్	25.2.19	7.6.21
52	శ్రీకేశ్ బి.లాఠకర్	8.6.21	1.2.24
53	మనజీర్ జిలానీ సమూన్	2.2.24	4.7.24
54	స్వప్నిల్ దినకర్ పుండ్కర్	5.7.24	ప్రస్తుతం

ఆమదాలవలస అందగాడు



ఆమదాలవలస అందగాడిగా పేరు తెచ్చుకుని, దక్షిణాది భాషల్లో ఎన్నో చిత్రాల్లో నటించిన సినీ నటుడు శరత్‌బాబు సినీ వినీలాకాశంలో ఆయన తనదైన ముద్ర వేశారు. హీరోగా, విలన్‌గా, సహాయ నటుడిగా పాత్ర ఏదైనా అందులోకి పరకాయ ప్రవేశం చేసి సహజ నటుడిగా ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. జిల్లా నుంచి ఎందరో నటులు సినీ పరిశ్రమ వైపు వెళ్లడానికి ఆయన ప్రేరణగా నిలిచారు. ఆమదాలవలస పట్టణంలోని డాబాలవారి వీధికి చెందిన విజయ శంకర దీక్షితులు, సుశీలా దేవికి 1951 జులై 31వ తేదీన శరత్‌బాబు జన్మించారు. కళాశాల చదివే రోజుల్లోనే నాటకాలు వేసేవారు. జగ్గయ్య, ఎస్.వి రంగారావు, చంద్రకళ, సావిత్రి... ఇలా అగ్ర నటులతో కలిసి మొదటి సినిమా 'రామరాజ్యం' తెరంగ్రేటం చేశారు. 1973లో విడుదలైన ఆ సినిమా హీరోగా తొలి ప్రయత్నంలోనే గుర్తింపు లభించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ.. ఇలా ఆరు భాషల్లో హీరో, విలన్, సహాయ నటుడిగా 250కి పైగా చిత్రాల్లో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్టుగా మూడు నంది అవార్డులు పొందారు. వెండితెర పైనే కాదు బుల్లితెర వేదిక గానూ ప్రేక్షకులకు చేరువగా పలు సీరియల్స్‌లో నటించారు. 2023 మే 22న మృతి చెందారు.





సిక్కోలు గురించి సంక్షిప్తంగా...

ఆగస్టు 15న జిల్లాగా ఏర్పడినా, మద్రాసు ప్రెసిడెన్సీ రెవెన్యూ మంత్రి కరంత్ డిసెంబర్‌లో పూర్తిస్థాయి జిల్లాగా ప్రారంభోత్సవం చేశారు.

ప్రస్తుత నాగావళి హోటల్ ఉన్న స్థలంలో అప్పట్లో మున్సిపల్ కార్యాలయం ఉండేది. శ్రీకాకుళం పురపాలక సంఘ చైర్మన్‌గా వ్యవహరించిన రమణయ్య చెట్టి జిల్లా ఏర్పాటుకు కొంత బంగారాన్ని విరాళంగా ఇచ్చారు.

విరాళాలతోనే కలెక్టరేట్, జిల్లా అవతరణకు కావాల్సిన ప్రాథమిక అవస రాలను సమకూర్చారు. కలెక్టర్ కార్యాల య మైదానంలో అప్పట్లో స్వాతంత్ర్య వేడుకలు, పోలీస్ పరేడ్‌లు జరిగేవి.

కళింగ చరిత్రకు హృదయం శ్రీకాకుళం. నగరికటకం రాజధానిగా గంగ వంశరాజులు ఈ ప్రాంతాన్ని పాలించే వారు. 1687లో కుతుబ్‌షాహీ పాలనలో చికాకోల్ ఫౌజారీ కేంద్రం ప్రారంభ మైంది. 1759లో ఫౌజ్‌దారీ పాలన అంతమై ఆంగ్లేయుల రాజ్యం వచ్చింది. 1936లో ఒడిశా రాష్ట్రం అవతరించింది.

అప్పటికి మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న గంజాం జిల్లా దక్షిణ భాగంలోని శ్రీకాకుళం, సోంపేట, టెక్కలి తాలు కాలను పూర్తిగా, పర్లాకిముండి, ఇచ్ఛా పురం, బరంపురం తాలుకాల్లో కొంత మేర విడదీసి విశాఖపట్నం జిల్లాలో చేర్చారు. అక్కడి నుంచి 1950 వరకు ఈ ప్రాంతమంతా విశాఖ జిల్లాలోనే కొనసాగింది.

రైలు బోగీలే అతిథిగృహాలు

జిల్లా అవతరించినా చాలాఏళ్లు విఐపిల కోసం అతిథి గృహాలు నిర్మించలేక పోవడంతో ఆమదాలవలస రైల్వే స్టేషన్ సమీపంలో కొన్ని మంచి బోగీలను ఉంచి వాటిలోనే ముఖ్యులకు వసతి కల్పించే వారు. అవసరమైతే ప్రస్తుతం శ్రీకాకుళం నగరంలో ఉన్న డచ్ భవన్‌లో బస ఏర్పాటు చేసేవారు.

జిల్లా కేంద్రానికి తొలుత రైల్వేస్టేషన్ అందుబాటులో ఉంటుంది కాబట్టి.. ఆమదాలవలస దరి చింతాడ వద్ద జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరికొందరు అప్పటి మద్రాస్ ప్రభుత్వాన్ని ఒప్పించి చివరకు శ్రీకాకుళాన్ని జిల్లా కేంద్రంగా నిర్ణయించారు.



